J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 36 09.02.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ఆంధ్రాలో పాగావేయడమే లక్ష్యంగా

# కమలనాథుల 'పద్మ'వ్యూహం!

## దేశ రాజధాని చుట్టూ రాష్ట్ర రాజకీయం




**తెలుగునాట కాషాయజెండా పాతడానికి కమలదళం వ్యూహరచన చేస్తోందా? ఉత్తరాదిన తిరుగులేని పార్టీగా అవతరించడానికి అవసరమైన ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ ముందుకెళ్తున్న భారతీయ జనతా పార్టీ, ఇప్పుడు దక్షిణాదిలో కూడా పార్టీని పటిష్టపరచడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోందా..?? ఇలాంటి ప్రశ్నలకి అవుననే సమాధానం చెప్తున్నారు రాజకీయ విశ్లేషకులు.**

అందులో భాగంగానే తాజాగా ప్రకటించిన "పద్మ" అవార్డులలో తెలుగు వారికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందన్నది వారి అభిప్రాయం. చిరంజీవిని, చంద్రబాబుని అయోధ్యకి ఆహ్వానించడం, వెంటనే చిరంజీవికి "పద్మ విభూషణ్" ప్రకటించడం... ఇవన్నీ భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని వేస్తున్న అడుగులే అన్నది వారి భావన.

గడచిన పదేళ్ల పాలనలో "ప్రధాని – అంబానీ – అదానీ" అన్న చిన్న అపోహకి, అపవాదుకి తప్ప ఇంకెక్కడా ఒక్క తప్పుకి కూడా అవకాశం ఇవ్వకుండా, ఒక్క తప్పటడుగు కూడా పడకుండా వ్యూహాత్మకంగా ప్రజాక్షేత్రంలో దూసుకుపోతోంది భాజపా. ఈ దశాబ్ద కాలంలో 'కుంభకోణం' (స్కామ్) అన్న పదానికి చోటివ్వకుండా జాగ్రత్తపడుతూ వచ్చింది. కొన్ని కోట్లమంది భారతీయుల కలగా మిగిలిన "అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ట" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ. ఇక ఎన్నికలు ఎప్పుడొచ్చినా కేంద్రంలో ముచ్చటగా మూడోసారి కొలువుతీరేది తమ ప్రభుత్వమే అన్న ధీమాతో ఉన్నారు మోడీ అండ్ కో. రామమందిరం ప్రారంభోత్సవం తరువాత "ఇండియా" కూటమిలో ఏర్పడిన భారీ కుదుపు తమ గెలుపుపై కమలనాథులలో మరింత విశ్వాసాన్ని పెంచిందనడానికి అనుమానమే అవసరం లేదు.

10 లో



## అద్వాణీకి అగ్రస్థానం

12 లో

### రామరథ సారథికి 'భారతరత్న' బహుమానం!

### జిల్లా వైసీపీలో చిచ్చుపెట్టిన నగరం

# వైసీపీకి వీపీఆర్ దూరం!

## బీజేపీ వైపు వేమిరెడ్డి చూపు?



**ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో నెల్లూరుజిల్లా వైసీపీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రముఖ దాత, సేవాభూషణ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ నుండి విరమించుకుంటున్నారన్న వార్త జిల్లా పార్టీవర్గాల్లో నిరుత్సాహాన్ని నింపింది. అంతే కాకుండా వీపీఆర్ వైసీపీకి రాజీనామా చేయబోతున్నారన్న మరో సంచలన సమాచారం కూడా పార్టీ శ్రేణుల్ని షాక్‌కి గురి చేసింది.**

ప్రభాకరరెడ్డి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటించినప్పటి నుండి వైఎస్ఆర్ పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. వైసీపీ వీపీఆర్‌తోనే తొలి పార్లమెంటు సీటుకి బోణీ కొట్టబోతోందని అందరూ భావించారు. జిల్లాలోని 8 శాసనసభ స్థానాల్లో కూడా వేమిరెడ్డి అభ్యర్థిత్వం అనుకూల పవనంలా పనిచేస్తుందని భావించారు. అయితే ఒక్కసారిగా వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. పార్టీ తీసుకున్న కొన్ని అనాలోచిత నిర్ణయాలు, పార్టీలోని కొందరు నాయకుల స్వార్థపూరిత పోకడలు ఇప్పుడు వేమిరెడ్డిని పార్టీ వీడేలా చేస్తున్నాయి. ఆయన ప్రమేయం లేకుండానే జరిగిన నగర అభ్యర్థి మార్పులో ఆయన పాత్ర ఉందని నింద వేశారు. ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ కొందరు నాయకులు మీడియాకెక్కారు. సామాజిక మాధ్యమాలలో ఆయనపై అసహ్యమైన అసత్య పోస్టింగులు పెట్టించారు. ఆయన జిల్లా అధ్యక్షుడైనప్పటికీ ఆయన పక్కన లేకుండానే పట్టుపట్టి నగర అభ్యర్థిని ప్రకటింపజేశారు. వీటన్నిటితో మనస్తాపం చెందిన వీపీఆర్ ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారు. విలువలు లేని ప్రాంతీయ పార్టీలు, సంస్కారం లేని స్థానిక నాయకులతో వేగడంకంటే బీజేపీ లాంటి జాతీయపార్టీలో ఉండడమే తనలాంటి వాళ్ళకి ఉత్తమమని ఆయన భావిస్తున్నారని వీపీఆర్ అభిమానులు చెప్తున్నారు. తమ నాయకుడు బీజేపీలో చేరడం

10 లో



# మోగిన చేనేతల 'విజయభేరీ'





చేనేతకారులు తమ ఐక్యతను చాటుకుంటూ 'విజయభేరీ' మోగించారు. తమ డిమాండ్ల సాధన కోసం నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 4న చేనేత ఐక్యవేదిక కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన చేనేత కులాల విజయ భేరి సభకు నేతకారులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ సభ చేనేత కారుల్లో చైతన్యాన్ని నింపింది. నగరంలోని మైపాడు గేటు వద్ద నుంచి డిజిపి కల్యాణ మండపం వరకు జరిగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో చేనేతకారులు రాట్నం వడుకుతూనే ర్యాలీలో పాల్గొనడం విశేషం. అనంతరం జరిగిన సభలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 55లక్షల మంది చేనేత జనాభా ఉన్నారని, కొన్ని నియోజకవర్గాల్లో చేనేతలే గెలుపు ఓటములను నిర్ణయిస్తారని అన్నారు. దేశంలో అతిపెద్దదైన రంగాల్లో వ్యవసాయం తర్వాత, చేనేతకారుల రంగం ఒకటని, అయితే ప్రభుత్వాలు మాత్రం చేనేతకారులు సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం చేనేతకారుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. చేనేతకారులు రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు చేయూత నందించాలని డాక్టర్ జడ్. శివప్రసాద్ కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, ఎంజీ బ్రదర్స్ అధినేత గంగాధర్, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, ప్రధాన కార్యదర్శి ఆశం సురేష్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, గోపాల్, రామనాథం, పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, దేవాంగ సంఘం అధ్యక్షుడు సతీష్, చేనేత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, చేవూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 'రైతే రాజైతే'..ఒక దార్శనికతకు నిలువుటద్దం!

సామాజిక శాస్త్రవేత్తలు మానవ సమాజాన్ని..వ్యవసాయానికి ముందరిదీ, తర్వాతదీ అని విభజిస్తారు. ప్రపంచ గమనపు అన్ని పార్శ్వాల్ని స్పృశించింది, శాసించింది కూడా వ్యవసాయమే కావడం దీనికి కారణం. పారిశ్రామిక విప్లవం అనేకరకాల వస్తుజాలంతో మనల్ని ముంచెత్తడంతో ఆహారం స్థానాన్ని 'అవసరాలు' ఆక్రమించసాగాయి. 'సంపద' సర్వస్వమై అదే అభివృద్ధికి నిర్వచనంగా మారిపోయింది.

ఆధునిక యుగం వ్యవసాయాన్ని సైతం పరిశ్రమగా, బహుళజాతి కంపెనీల చేతిలో బందీగా మార్చాక, మనలాంటి వెనకబడ్డ దేశాల్లో వ్యవసాయం మరీ అతలాకుతలమైంది. ఫలితంగా గ్రామీణ ఉపాధి, ఉత్పత్తి రెండూ కుదేలయ్యాయి. దేశంలో ఎక్కడా లేనట్టు తెలుగునాట 'నగరాలే సంపదను సృష్టిస్తాయి', 'గ్రామాలు వీలున్నంత త్వరగా నగరాల్లో విలీనమైపోవాలి', 'అసలు అభివృద్ధి అంటేనే నగరీకరణ"..అనే వాదాలు ముందుకొచ్చి 'వ్యవసాయం దండగ" అనేంత దూరం ఈ ధోరణి వెళ్లిపోయింది. దీంతో మొత్తం ఉత్పత్తి రంగానికే మన రాష్ట్రంలో కష్టాలొచ్చాయి. ఫలితంగా వ్యవసాయంపై పెట్టుబడులు నానాటికీ అడుగంటడం. ఎప్పుడూ లేని విధంగా రైతుల ఆత్మహత్యలు పెరగడం, గ్రామీణ ఉపాధి కరువై పొట్ట చేత పట్టుకుని జనం వలసలు వెళ్లాల్సి రావటం కూడా ఎక్కువైంది. ఇది మన రాష్ట్రంలో రెండు రాజకీయ విధానాలకు, రెండు అభివృద్ధి సూత్రాలకు ఘర్షణగా మారింది. ఒకటి.. ఆకాశంలోని మబ్బుల్ని నమ్ముకొని ముంతలోని నీళ్లను ఒలకపోసుకునే ప్రపంచబ్యాంకు విధానం. రెండు..నేలకు కాళ్లు గట్టిగా తన్నుకొని నిలబడ్డం కీలకమని నమ్మిన ఆచరణాత్మక అభివృద్ధి విధానం. ఈ నేపథ్యంలో 'రైతే రాజైతే.. వ్యవసాయం పండుగే' గ్రంథం రెండో పంథాకు పట్టం కడుతుంది. దీన్ని ఏవో కొన్ని సాగునీటి పథకాల, సంక్షేమ కార్యక్రమాల సంపుటిగా చూడకుండా, మాజీ ముఖ్యమంత్రి.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి ఒక దృక్పథంలో భాగంగా చూచినప్పుడు మాత్రమే ఇది స్పష్టమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు ఉచిత విద్యుత్తు కోసం ఆయన కాంగ్రెస్ అధిష్టానంతోనే తలపడాల్సి వచ్చింది. ప్రపంచ బ్యాంకు విధానాల్ని ఎదిరించాల్సి వచ్చింది. బీటీ విత్తనాల ధరల నియంత్రణ కోసం మాన్ శాంటో లాంటి బహుళ జాతి కంపెనీల మీద యుద్ధం చేయాల్సి వచ్చింది. వర్ధమాన దేశాల భవిష్యత్తు వ్యవసాయంపై మనం పెట్టే పెట్టుబడులపై ఆధారపడి ఉందని అంతర్జాతీయ వేదికలపై వాదించి ఒప్పించాల్సి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే, పేదలకు అనుకూలమైన ఒక దృక్పథాన్ని ఆచరణలోకి తేవాలంటే అడుగడుగునా ఘర్షణ తప్పదని ఈ గ్రంథం మనకు పదేపదే గుర్తు చేస్తుంది. పట్టుదల, ప్రజల పట్ల బాధ్యత వుంటే ఈ ఘర్షణని ఇష్టంగా చేయవచ్చునని, అందులో గెలిచి తీరవచ్చునని కూడా ఇది మనకు తెలియజేస్తుంది. 'ఎంత డబ్బయినా సరే ఖర్చుచేసి ఒక్క పైరుకైనా ప్రతి ఎకరానికీ నీళ్ళు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత'- అనే పుచ్చలపల్లి సుందరయ్య గారి మాటలు ఎంత విలువైనవో ఈ గ్రంథం రుజువు చేస్తుంది. దీన్ని ఇప్పటికీ సాధించలేని మన అసక్తతను సూటిగా హెచ్చరిస్తున్నట్టు కనిపిస్తుంది.

'వ్యవసాయాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత అసలు సమస్యలు ప్రపంచీకరణ, ప్రభుత్వాలకు నికరమైన విధానాలు లేకపోవడం, నీటి పారుదల ప్రాజెక్టులను విస్మరించడం, స్థిరమైన పెట్టుబడులు పెట్టకపోవడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరిచిపోవడం'.. అని జయతీ ఘోష్ కమిటీ తేల్చి చెబుతుంది. ఇలాంటి నివేదికలని అలవోకగా అటకెక్కించడం మనకు అలవాటు. కానీ, ఉన్నంతలో ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే దీని అమలుకు పూనుకుందని ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ ప్రశంసించడం ఆశ్చర్యమే. కానీ వైయస్సార్‌ను దగ్గరగా చూసిన వారికి మాత్రం అది వైయస్సార్ సహజ స్వభావ మనిపిస్తుంది.




'రైతే రాజైతే'
రచయితలు:
డా॥ కె.వి.పి.రామచంద్రరావు
డా॥ ఎన్.రఘువీరారెడ్డి
పేజీలు : 264 వెల. రూ. 500/-
ప్రతులకు : ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029..

మనం పెద్దగా దృష్టి సారించని అంశం ఏమంటే మన గ్రామీణ రైతుల, రైతు కూలీల బతుకులు ఛిన్నాభిన్నం కావడంలో విద్యా-ఆరోగ్యమూ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని. ఇవి రెండూ ప్రైవేటుపరం కావడంతో వీళ్ళ వెన్నెముక విరిగిపోయిందని!.. ఎందుకు దేశంలో ఎక్కడా లేనట్టు తెలుగునేల మీద ఇలా జరిగిందని జయతీ ఘోష్ ప్రశ్నిస్తారు. దీనికి ఉన్నంతలో పరిష్కారం అప్పటి ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీ, ఫీజు రియెంబర్స్‌మెంట్‌గా కనిపించాయి. వీటిని ఇప్పటి దాకా మనం ఈ కోణంలో నుంచి చూడలేకపోయాం. "రైతే రాజైతే" గ్రంథం వైయస్సార్‌లోని ఈ దార్శనికతను పరిచయం చేస్తుంది. అయితే, కాలం మారుతోంది, రైతు ఇటీవల మరీ పరాయీకరణ చెందాడు. ప్రతిదానికీ ఎరువుల నుంచి విత్తనాల దాకా, మార్కెట్ నుంచి బహుళ జాతి కంపెనీలపై దాకా ఆధారపడాల్సి వస్తోంది. దీంతో రైతు నిస్సహాయుడైపోతున్నాడు. భూమి నిస్సారమవుతోంది. వినియోగదారుడు రోగాలు బారిన పడుతున్నాడు. ఇప్పుడు కావలసింది వ్యవసాయం పట్ల ఒక సమగ్ర దృక్పథం. రైతుకు ఖర్చు తగ్గించకుండా, మార్కెట్ అదుపులోకి రాకుండా, ప్రకృతి మిత్రగా వ్యవసాయం సాగకుండా దీనికి శాశ్వత పరిష్కారం దొరకదు. దీన్నిలా అర్థం చేసుకోవడం పెద్ద సమస్య. సవాలుగా స్వీకరించి ఎదుర్కోవడం అసలు సమస్య. "రైతే రాజైతే" పుస్తకాన్ని చదువుతున్నప్పుడు ఒక విశ్వాసం కలుగుతుంది. ఇలాంటి ఎంత పెద్ద సవాళ్ళనైనా ఎదిరించి లొంగదీసుకోవచ్చునని!.. మనసుంటే మార్గం ఉంటుందని!...



**విశపు బాలసుబ్రహ్మణ్యం**
మాజీ సభ్యులు - ఆంధ్రప్రదేశ్ శాసనమండలి



# నేత్రపర్వంగా.. జగన్నాథుని రథయాత్ర

## ○ వేలాదిగా పాల్గొన్న భక్తజనం

అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్యసంఘం (ఇస్కాన్) నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఇటీవల 11వ శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. నగరంలో 'హరే రామ హరే కృష్ణ' నామోచ్చరణలు మార్మోగాయి. 'జై జగన్నాథా..జై జై జగన్నాథా' అంటూ భక్తులు పెద్దపెట్టున చేస్తున్న జయజయధ్వానాలతో రథయాత్రం కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా తొలుత ఆలయ అర్చకులు శ్రీ జగన్నాథస్వామి, బలదేవ, సుభద్ర దేవతామూర్తులను శోభాయమానంగా అలంకరించి, రథంపై కొలువుదీర్చి నైవేద్యంగా 56 రకాల ప్రసాదాలను స్వామివార్లకు నివేదించారు. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం కార్యవర్గ కమిషన్ ఛైర్‌పర్సన్ రేవతిరామన్‌దాస్ మహాప్రభు పాల్గొని రథంపై ఆశీనులైన దేవతామూర్తులు శ్రీ గౌర-నితాయ్‌లకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)-వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల సహకారంతో, నెల్లూరు ఇస్కాన్ మందిరం నిర్వాహకులు శుకదేవస్వామి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సాగిన ఈ రథయాత్రను వేల సంఖ్యలో భక్తులు తిలకించుకున్నారు. రథయాత్ర పొడవునా భక్తులు టెంకాయలు కొట్టి, హారతులందుకున్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న నాలుగుకాళ్ళ మండపం వద్ద నుంచి ప్రారంభమైన రథయాత్ర ఏసీ బొమ్మ కూడలి, ట్రంకురోడ్డు, విఆర్‌సి సెంటర్, ముత్తుకూరు గేటు సెంటర్, మినీబైపాస్‌ల మీదుగా పీవీఆర్ కల్యాణమండపానికి చేరుకుంది. కోలాటాలు, భజన బృందాలతో కోలాహలంగా సాగిన రథయాత్ర ఆద్యంతం భక్తిభావ సమన్వితంగా ఉండి అందరినీ ఆకట్టుకుంది. జిల్లా నుంచే కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక ఇస్కాన్ మందిరాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసాదాలను అందజేశారు.

# జిల్లా గ్రంధాలయానికి..'దంపూరు' గ్రంథ వితరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత, కలెక్టరేట్ విశ్రాంత పరిపాలన అధికారి దంపూరు రామకృష్ణ తాను రచించిన కనుపర్తిపాడు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ చరిత్ర పుస్తకాలను ఈనెల 5న జిల్లా గ్రంధాలయాల శాఖలన్నిటికీ ఉచితంగా పంపిణీ చేసేందుకు 90 పుస్తకాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజాకు అందజేశారు. నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో కొలువైఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం చరిత్ర ప్రజలకు చేరువ చేసేందుకు అందరికీ ఈ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు ప్రసాద్, కృష్ణయ్య ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం..

# సేంద్రీయ కూరగాయల విక్రయం

**- డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి**

నెల్లూరు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం సేంద్రీయ కూరగాయలను విక్రయించనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి తెలిపారు. ఈనెల 5న కలెక్టరేట్‌లో సేంద్రియ కూరగాయల స్టాల్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ, కలెక్టరేట్లో సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి ప్రజలు వస్తుంటారని, వీరందరికీ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన నాణ్యమైన కూరగాయలను విక్రయించాలనే ఉద్దేశంతో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఎటువంటి రసాయనిక మందులు లేకుండా సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలను ప్రతి సోమవారం విక్రయించడం ద్వారా ప్రజల్లో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కలుగుతుందన్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలు ఈ వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేంద్రీయ కూరగాయలను కొని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు.



# బూతులు మాట్లాడేవారికి..
# ‘బూతు’లోనే సమాధానం చెప్పండి

## ప్రజలకు మన వెంకయ్య పిలుపు

‘బూతులు మాట్లాడే రాజకీయనాయకులకి ‘బూతు’లోనే.. అంటే ‘పోలింగ్ బూతు’లోనే సమాధానం చెప్పాలని, అది మీ చేతుల్లోనే ఉందని’ భారత పూర్వ ఉప రాష్ట్రపతి..మన వెంకయ్యనాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన ‘పద్మ’ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమంలో ఆయన తనదైన శైలిలో అనర్ఘళంగా మాట్లాడుతూ అందరి కరతాళధ్వనులందుకున్నారు. ‘ఎమ్మెల్యేలు బూతులు మాట్లాడుతున్నారని, అలాంటి వాళ్లకి తగిన గుణపాఠం చెప్పాలంటే పోలింగ్ బూతులోకి వెళ్ళి బటన్ నొక్కితే సరిపోతుందని’ ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు రుజువర్తన లేనివారిని, నీతి నిజాయితీ లేనివారిని, ఇతర విషయాలపై ఆధారపడి జనాన్ని రెచ్చగొట్టి గెలిచేవారిని ఓడించాలని, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని, అందుకు సమయం ఆసన్నమైందని చెప్పారు. మంచిగా ఉండే వ్యక్తులను ప్రజలు ఎన్నుకోవాలన్నారు. కులం పేరుతో, మతం పేరుతో, వర్గం పేరుతో, వర్ణం పేరుతో, జిల్లా పేరుతో, భాష పేరుతో జనాన్ని చీల్చే ప్రయత్నాలు చేయకూడదని నాయకులనుద్దేశించి హితవు చెప్పారు. నాలుగు ‘సీ’లు…అంటే, ‘క్యారెక్టర్, కాలిబర్, కెపాసిటీ, కాండక్ట్’ ఉన్న వ్యక్తులను ప్రజలు ఎన్నుకోవాలన్నారు. రాజకీయంలోనే కాదు, ఏ రంగంలోనైనా సరే అలాంటివారిని ప్రోత్సహించాలన్నారు. కానీ, కొంతమంది నాయకులు వాటికి బదులుగా ‘క్యాస్ట్, కమ్యూనిటీ, క్యాష్, క్రిమినాలిటీ’.. అనే నాలుగు కొత్త ‘సీ’లను కనిపెట్టారని చురకంటిస్తూ, అలాంటివి తాత్కాలికంగా ఒకసారి ఉపయోగపడవచ్చేమో కానీ, ఎల్లకాలం రక్షించవని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు మంచితనంతో మంచిగా ప్రజలకు మేలుచేసే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని వెంకయ్యను ఘనంగా సన్మానించారు.

# అనిల్ స్థానంలో ఖలీల్




నెల్లూరు నగర శాసనసభా స్థానం వైకాపా అభ్యర్థిగా అధిష్టానం అనిల్ స్థానంలో ఖలీల్‌ను నియమించింది. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో, ఆ స్థానంలో నెల్లూరు నగర అభ్యర్థిగా డెప్యూటి మేయర్ ఎం.డి ఖలీల్ అహ్మద్ రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. వైకాపా అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మైనార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నెల్లూరు నగరానికి మైనార్టీ అభ్యర్థికి అవకాశం కల్పించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా అనిల్-ఖలీల్ ఇద్దరూ కలసి ఇటీవల తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు నగర అభ్యర్థిగా అధిష్టానం ఖలీల్‌ను ఎంపికచేయడం పట్ల నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ముస్లిమ్ మైనార్టీల పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో గౌరవం ఉందని ఆయన పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆదాల ఈ సందర్భంగా కోరారు.

## దశాబ్దాల కల సాకారం…
# ముదివర్తిపాళెం కాజ్‌వేకి శ్రీకారం

- పనులకు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే ప్రసన్న



దశాబ్దాల కలగా మిగిలిపోయిన ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెం, విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామాల మధ్య పెన్నానదిపై సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణ పనుల ప్రారంభంతో ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ నిర్మాణ పనులకు ఇటీవల ముదివర్తి పాళెంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాజ్‌వే నిర్మాణానికి తొలివిడతగా 93.92 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని, ఆ నిధులతో దాదాపు 1050 మీటర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నామని చెప్పారు. ఆ తర్వాత అప్రోచ్ రోడ్డు, ఫ్లడ్ బ్యాంక్ నిర్మాణాలకు రూ. 130 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామన్నారు. ఈ కాజ్‌వేకి ‘వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాజ్‌వే’గా నామకరణం చేస్తున్నామని, ఆ ప్రతిపాదనలను సంబంధిత శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నామని ఆయన తెలిపారు.

శ్రీ నెల్లూరు గోపాల్‌రెడ్డి గారు

జననం : 1933 నిర్యాణం : 2024

# ఉత్తరక్రియలు

ఆత్మీయదీప్తి, అనురాగమూర్తి, మహోన్నత వ్యక్తి,
మాకు మార్గదర్శకులు, మా ఇంటి దైవం

## శ్రీ నెల్లూరు గోపాల్‌రెడ్డి గారు

తే. 01.02.2024వ గురువారం నాడు ఉ॥ 8.55 ని॥లకు స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ…

కుమారుడు - కోడలు
**ఎన్.వి.భాస్కర్‌రెడ్డి - ప్రమత**

అల్లుడు - కుమార్తె
**డా. ఎస్.వి.కృష్ణారెడ్డి - విజయలక్ష్మి**

మనుమలు, మనుమరాండ్రు
**నెల్లూరు అక్షయ్‌కుమార్‌రెడ్డి**
**దేవిరెడ్డి వరుణ్‌రెడ్డి - నిహారికరెడ్డి**
**సామంతు ప్రణీత్‌రెడ్డి - స్మృతిరెడ్డి**
**సామంతు ప్రీతమ్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు :**
వారి వైకుంఠ సమారాధన తేది. 15.02.2024
గురువారం, నెల్లూరు రామమూర్తి నగర్‌లోని
మా స్వగృహము నందు జరుగును.

లాయర్
ఫిబ్రవరి 09, 2024

# 'ఆరోగ్య సిరుల' పట్ల అలక్ష్యం పనికిరాదు

ఏదేం దురదృష్టమో తెలియదు కానీ, మనదేశంలో పంటల సాగుకు అన్ని వనరులు పుష్కలంగా ఉన్నా దేశ ప్రజలకు మాత్రం ఆహారకొరత తీరడం లేదు. పంటలెంతగా పండుతున్నా పాలకుల అసంబద్ధ విధానాలతో స్వయం సమృద్ధిని సాధించడం లేదు. ఇతర దేశాల నుంచి ఏటా వాటి దిగుమతులు ఎక్కువవుతున్నాయే కానీ తగ్గడంలేదు. మరోవైపు, నానాటికి ధరలు ఆకాశానికంటుతున్నాయే తప్ప నేలకి దిగి రావడం లేదు. పంటలకు పుట్టినిల్లయిన భారతావనిలో చివరికి ప్రజలకు నిత్యం అవసరమయ్యే పప్పుధాన్యాల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. గత ఏడాది కిలో 90 రూపాయలున్న కందిపప్పు ధర ఈ ఏడాది 190 రూపాయలకి పెరిగింది. మినపప్పు రూ.80 నుండి రూ.130కి ఎగబాకింది. శెనగపప్పు కిలో ధర రూ.70 నుంచి రూ. 100కు చేరిపోయింది. దుకాణాల వద్దకు వచ్చేసరికి ఇలా పప్పుల ధరలు ఇంతగా పెరిగిపోతుండడంతో సామాన్యులకు పోషకాహారం అందుబాటులో లేకుండా పోతోంది. అందుకు తగ్గట్టు దేశంలో 40 లక్షల ఎకరాలకు పైగానే ఉన్న కందిపంట సాగు విస్తీర్ణం కూడా బాగా తగ్గిపోతోంది. వ్యాపారులకు తప్ప రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు పంటల సాగుపై నిరాసక్తత చూపుతున్నారు. దీంతో కందిపప్పు ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఇతర దేశాల నుంచి దిగుమతులు తప్పనిసరి అవుతున్నాయి. దేశానికి కనీసం 29 కోట్ల టన్నుల పప్పు దినుసులు అవసరమై ఉంటే, వివిధ కారణాల వల్ల వాటి కొరత ఉండడంతో దిగుమతులపై దృష్టి సారించాల్సి వస్తోంది. గత ఏడాది దాదాపు 29 లక్షల టన్నుల కందిపప్పు, మినప్పప్పు వగైరాలను దిగుమతి చేసుకున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఆస్ట్రేలియా, కెనడా, రష్యా, మయన్మార్, టాంజానియా తదితర దేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. పప్పుధాన్యాల పంటల విస్తీర్ణంలో ప్రపంచంలోనే మనదేశం అగ్రగామిగా ఉన్నా, పప్పుల కోసం ఇతర దేశాల మీద ఆధారపడక తప్పడం లేదు. ప్రతిఏటా కనీసం 30 లక్షల టన్నుల దాకా వాటిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా, ధరల పెరుగుదలను నియంత్రించ లేకపోవడం మనదేశంలో ఒక పెద్ద లోపం. పంటలు పండించే రైతులు ఎప్పుడూ కష్టాలను ఎదుర్కొంటుంటే, వాటిని తక్కువ ధరకే కొనుక్కుని ఎక్కువ ధరలకు విక్రయించుకునే వ్యాపారులకు, దళారీలకు లాభాలు పండుతున్నాయి. మొత్తంగా ఉత్పత్తి, కొనుగోళ్ళు, విక్రయాల మధ్య సరైన విధానాలు లోపించడం వల్లే ఏళ్ళతరబడిగా రైతుల దుస్థితి మారడం లేదు. మంచి పోషక పదార్థాలు కలిగివుండే పప్పు ధాన్యాల ఉత్పత్తిని దేశీయంగా ప్రోత్సహిస్తూ, సాగు వనరులను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటూ, పప్పుల ధరలను పేదలకు, సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా చూడగలిగితే ఎంతో ప్రయోజనం ఉంటుంది కానీ, ఆ దిశగా పాలకులు ఆలోచించడం లేదు. ముఖ్యంగా పుష్కలమైన పోషకాహార పదార్థాలతో 'ఆహార సిరులు'గా పేరుగాంచిన పప్పుధాన్యాల ఉత్పత్తుల పెంపుదల పట్ల ప్రభుత్వాలు నేటికీ అలక్ష్యంగా ఉండడం విచారకరం. ఇకనైనా ఈ దుస్థితి పోవాలి. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగాలి. అందుకు ఏం చేస్తే బాగుంటుందో ప్రభుత్వాలు సంబంధిత శాస్త్రవేత్తలు, నిపుణులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. పప్పుధాన్యాలను సరసమైన ధరలకు అందించడానికి ప్రణాళికలు రూపొందించాలి.

తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలతో పాటు కేవలం మూడు నెలల వ్యవధిలోనే పంట చేతికి అందివచ్చే స్వల్పకాలిక పంటలైన పప్పుధాన్యాల సాగు రైతులకు అన్నివిధాలా మేలును కలిగిస్తాయి. అంతేకాదు, భూసారాన్ని పెంపొందించడానికి కూడా ఈ పంటలు ఎంతో ఉపకరిస్తాయి. చౌడుబారిన భూములు, రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల నిస్సారంగా తయారైన భూములు కూడా ఈ పంటల సాగు వల్ల తిరిగి జీవశక్తి పుంజుకుంటాయి. అటు ప్రజలకు ఎంతో బలవర్ధకమైన పోషకాహారం పప్పుధాన్యాలే. కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పు, బఠాణీలు, సోయాబీన్స్, ఉలవలు, అలసందులు వంటి పప్పుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల వ్యాధినిరోధకశక్తి పెరిగి, పలు రకాల వ్యాధులు, సమస్యలు రాకుండా నివారించుకోవచ్చు కూడా. మంచి ఆహారం వల్లే మంచి ఆరోగ్యం ఉంటుంది. అటు రైతులకు, ఇటు ప్రజలకు.. మొత్తంగా దేశానికి ఇన్నిరకాల ప్రయోజనాలున్న ఈ పంటల సాగు పట్ల ప్రభుత్వాలు ఇకనైనా పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. తద్వారా పూర్తిస్థాయిలో 'ఆరోగ్య భారత్'ను సాకారం చేసుకోవాల్సి ఉంది.

- ఫిబ్రవరి 10.. ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవం

# గోపాలరెడ్డి తరువాత అంతటి వారు వెంకయ్యనాయుడు

నెల్లూరుజిల్లా రాజకీయ నాయకులకి ఒక ప్రత్యేకత ఉంది. జాతీయ స్థాయిలో మన నెల్లూరు ఖ్యాతిని చాటి అనేకమంది నాయకులు ఘనత వహించారు. వారిలో నెల్లూరుకి ఎనలేని కీర్తిని ఇనుమడింపజేసిన నాయకులలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ప్రథములు. రాజకీయాలలో నైతిక విలువలకి ప్రతీకగా నిలచిన నాయకుడు గోపాలరెడ్డి గారు. ఆయన తరువాత అంతటి స్థాయిలో రాణించిన వ్యక్తి మన వెంకయ్యనాయుడు. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలన్న గుణానికి ప్రతిరూపం వెంకయ్యనాయుడు. ఆయనకి 'పద్మవిభూషణ్' ప్రకటించడం ఆనందదాయకం. ఉపరాష్ట్రపతి స్థాయికి వెళ్లినవారికి ఈ పురస్కారం చంద్రునికో నూలుపోగు లాంటిదే. వారి ప్రతిభానైపుణ్యానికి, అనితరసాధ్య ప్రస్థానానికి దక్కిన గౌరవం ఈ సత్కారం. పద్మవిభూషణం నెల్లూరుకే భూషణమే. వెంకయ్యనాయుడి గారికి నా అభినందనలు.

సి. ఆర్. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

# ఈ దోమలు వాళ్ళని కుట్టడంలేదా?

నెల్లూరు నగరంలో దోమల బెడద ఎక్కువైపోయింది. దోమలు కోట్లసంఖ్యలో తిరుగుతున్నాయి. ముఖ్యంగా మాగుంట లే అవుట్, ఇస్కాన్ సిటీ, కొండాయపాళెం ప్రాంతాలలో ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలలో నీళ్లు నిలబడిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. మునిసిపల్ అధికారులు పట్టించుకుని ఖాళీ స్థలాలని పూడిపిస్తే తప్ప పరిస్థితి మారదు. దోమల నివారణ కోసం ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలు కూడా అటకెక్కినట్లున్నాయి. అవి రోడ్లపై కనిపించి చాలా కాలమయ్యింది. నడ్డి విరిగే వడ్డీలతో పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ అధికారులని ఈ దోమలు కుట్టడం లేదేమో. అందుకే వాళ్ళకి ప్రజల బాధలు పట్టడంలేదు.

ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.




# పోలిక బాగుంది!

పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకోబోతున్న వెంకయ్యనాయుడు, చిరంజీవిలకి ముందుగా నా అభినందనలు. వారిద్దరి గురించి "ఒకరు నెల్లూరుకి ముద్దు బిడ్డ, మరొకరు దత్తు బిడ్డ" అని 'లాయర్'లో చక్కగా రాశారు. ఆ ఇద్దరిపై 'లాయర్' చేసిన "అక్షరాభిషేకం" కూడా సమగ్రంగా సంపూర్ణంగా ఉంది. చిన్ని నారాయణరావు కవిత కూడా సందర్భోచితంగా ఉంది.

ఎమ్. రాజ్యలక్ష్మి,
విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు,
నెల్లూరు.

## సత్యవేదం
నిజాలే మాట్లాడుకుందాం! 24

# సలహాదారులంటే పెత్తందార్లు కాదు!



"సలహాదారులు"... ఈ వ్యవస్థ ఇప్పటిది కాదు. పురాణాలలో, ఇతిహాసాలలో సైతం సలహాదారుల వ్యవస్థ ఉండేది. తాము పరిపాలించే రాజ్యాలు సుభిక్షంగా ఉండాలని, తమ ప్రజలంతా ధనధాన్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కళకళలాడుతూ ఉండాలని రాజులు కాంక్షించేవారు. అన్ని వేళలా అన్ని ప్రాంతాలకీ రాజే స్వయంగా వెళ్లి ప్రజల బాగోగులు చూడలేడు కాబట్టి, ఆయన క్రింద మహామంత్రి, మంత్రులు అనే వ్యవస్థను రూపొందించుకున్నారు. తాము నియమించుకునే మంత్రులలోనే కొంత మంది అత్యంత ఆంతరంగీకులని ఎంపికచేసుకుని వారికి పట్టంకట్టి, వారినే సలహాదారులుగా కూడా పరిగణించేవారు. మంత్రులు చాలామందే ఉన్నా ఆ ముఖ్యమైనవారు మాత్రం రాజు మేలునే కోరుకునేవారు. నిస్వార్ధంతో పనిచేసేవారు. బంధుప్రీతి అన్న పదానికి అర్ధం కూడా తెలియదన్నట్లుగా వ్యవహరించేవారు.

సాక్షాత్తూ శ్రీరామ చంద్రుడికి జన్మనిచ్చిన అయోధ్య పరిపాలకుడు దశరథ మహారాజు వద్ద కూడా ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అని ఎనిమిది మంది మంత్రులుండేవారు. వాళ్లంతా అత్యద్భుతమైన మేధాశక్తితో ఎదుటివారి ముఖకవళికలను బట్టి వారి మనస్సులోని ఉద్దేశ్యాన్ని ఇట్టే పసిగట్టేసేవారు.

తమ రాజుకి మేలుకలిగించే కార్యక్రమాలనే వాళ్ళు చేపట్టేవారు. నిత్యం ఆయన శ్రేయస్సు కోరుతూ ఆయనకి ఉపయోగపడే పనులని మాత్రమే చేపడుతూ ఆయన పాలనలో ఎక్కడైనా లోపాలు ఉంటే... వెంటనే వాటిని సరిచేసి రాజు కీర్తిని ఇనుమడింపచేసేలా శ్రమించేవారు. అత్యంత నిబద్ధతతో పటిష్టమైన గూఢచార వ్యవస్థతో రాజ్యం నలుమూలలా ఎక్కడ ఏం జరిగినా క్షణాలలో తమకు తెలిసేటట్లుగా వ్యవస్థను రూపొందించుకుని పనిచేసేవారు. తమ రాజు బాగుంటే రాజ్యం బాగుంటుంది, రాజ్యం బాగుంటే... అందరూ బాగుంటారనే ఆలోచనతో నిత్యం రాజు హితం కోసమే తపించేవారు.

తమ కుటుంబసభ్యులైనా, స్వయంగా వారు తమ కొడుకులైనా తప్పుచేస్తే సామాన్యులకి విధించే శిక్షణే వాళ్లకి విధింపచేసేవాళ్ళు. ఒక విధంగా చెప్పాలంటే సామాన్యుడు, పలుకుబడికలిగిన వారూ ఇద్దరూ ఒకేవిధమైన తప్పుచేస్తే, సామాన్యుడికంటే పలుకుబడి కలిగిన వ్యక్తికే ఎక్కువ శిక్ష పడేలా చూసేవారు. అంటే, తమ రాజు పాలనలో తప్పుచేస్తే ఎవరైనా ఒక్కటే అన్న సందేశాన్ని స్పష్టంగా ప్రజలలోకి పంపేవారు.

## పూర్తి భిన్నంగా నేటి సలహాదారుల వ్యవస్థ!

నేటి ప్రభుత్వాల వ్యవహారశైలి గతానికి పూర్తి భిన్నంగా ఉంది. మంత్రులను డమ్మీలుగా మార్చి రాజకీయాలు, పరిపాలన వంటి అంశాల పట్ల అవగాహన లేని అపరిపక్వత కలిగిన తమ బంధువులు, అనుయాయులతో ప్రత్యేక సలహాదారు వ్యవస్థను నేటి పాలకులు రూపొందించుకున్నారు. వారు ఏర్పాటు చేసుకున్న సలహాదారుల వ్యవస్థను గమనిస్తే ఆశ్చర్యంతోపాటు ఒకింత అసహ్యం కూడా కలుగుతుంది. తాము వ్యవహరించాల్సిన విధానానికి పూర్తి భిన్నంగా నేటి సలహాదారులు పనిచేస్తున్నారు. "రాజు ఏమైపోతే మాకెందుకు, మేం బాగుంటే చాలు" అన్న తరహాలో తమ విధులు విస్మరించి, స్వార్ధమే పరమావధిగా పబ్బం గడుపుకుంటున్నారు. ఓ వైపు గౌరవ వేతనాల పేరుతో కోట్ల రూపాయలు తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతూ, మరో వైపు అవినీతి, అక్రమాలతో కోట్లకి పడగలెత్తుతున్నారు. తమ వారసులను కూడా ప్రభుత్వ పథకాలలో భాగస్వాములని చేస్తూ దొరికిన మేరకు దోచుకుంటున్నారు. అన్నీ తామే.. అంతటా తామే.. అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

తమ నాయకుడి ఆశీస్సులతో మంత్రులైన వారిపైనా, ప్రభుత్వ విభాగ అధిపతులపైనా అజమాయిషీ చెలాయిస్తూ పెత్తనం చేస్తున్నారు. తమని కాదని ఎవరైనా ఎదిరిస్తే పార్టీ నాయకుడైతే పక్కన పెట్టడం, అధికారైతే బదిలీ చేసి ప్రాధాన్యత లేని స్థానంలో కూర్చోబెట్టడం వంటివి చేస్తున్నారు. పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు, పార్టీని కూడా భ్రష్టుపట్టిస్తున్నారు. తమకి భజనచేసే వాళ్లకి, కాళ్లు పిసికే వారికి, సాయంకాలపు అవసరాలు తీర్చేవారికి ప్రాధాన్యత కల్పించి ప్రభుత్వ, పార్టీ పదవులను కట్టబెడుతున్నారు.

ప్రత్యక్ష రాజకీయాలలో అనుభవం ఉన్న సీనియర్లని పక్కనపెట్టి ఇలాంటి వాళ్లని అందలం ఎక్కించడంతో, ఒక్కసారిగా వారిలో వచ్చిన అధికార అధిపత్యపు అహంకారం వారిచేత తప్పటడుగు వేయిస్తోంది. తమ పార్టీకి ఆ పార్టీ నాయకుడికి మంచి చేయాల్సిన సలహాదారు వ్యవస్థ చేస్తున్న స్వార్ధపూరిత అసంబద్ధ కార్యక్రమాల వల్ల మేలు కంటే.. కీడే ఎక్కువ జరుగుతోంది. ఇప్పటికే కొన్నిచోట్ల అనేక ఉదాహరణలు మన కళ్ళముందు కనపడుతున్నాయి. భవిష్యత్తులో ఇంకెన్ని ఘోరమైన అనుభవాలు ఎదురుకాబోతున్నాయో..? సలహాదారులంటే పెత్తందారులమనుకుంటే ప్రజలు తమ నాయకుడికి ఇచ్చిన పెత్తనం కూడా తీసేస్తారు. ఆ విషయం ఈ సలహాదారులు గ్రహిస్తే మంచిది!

- రాజశ్రీ



# ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలి

**- ఢిల్లీ ధర్నాలో బీఎంఆర్**

కేంద్రంలో మొత్తం 72 మంత్రిత్వ శాఖలు ఉన్నాయని, సహకార, మత్స్య శాఖలు ఇటీవల ఏర్పాటయ్యాయని, అదేవిధంగా ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 6న పెద్దఎత్తున జరిగిన బీసీల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓబీసీల కోసం రిజర్వేషన్ విధానాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని కోరారు. దేశంలో దాదాపు 75 కోట్ల మంది ఓబీసీలున్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఓబీసీలు ఉన్నప్పటికీ వారికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడంతో విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం జరగడం లేదన్నారు. ఓబీసీలకు కనీసం లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని, రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరుతూ, ప్రధానమంత్రి మోదీ ఈ విషయాలు పరిశీలించి ఓబీసీలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాందోళనలో రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



"నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా ఇటీవల నెల్లూరుకు విచ్చేసిన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి శ్రీమతి నారా భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తున్న కర్ణాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్ చౌదరి.

# సాంకేతిక విద్యతోనే ఉపాధి..ఉద్యోగం

**ఎస్వీయు విశ్రాంత వీసీ ప్రొ. మురళి**



నేటి అధునాతన సమాజంలో యువత ఉపాధిని, ఉద్యోగాలను పొందాలంటే నైపుణ్యం కలిగిన సాంకేతిక విద్యతోనే అది సాధ్యమని తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.మురళి చెప్పారు. ఈనెల 4న నెల్లూరు ఇస్కాన్‌సిటీలో ఉన్న డా. ఎస్సార్కే నెక్స్ట్‌జెన్ స్కూల్‌లో 'విద్య-ఉపాధి-ఉద్యోగం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి విద్యను సముపార్జించడమే కాక, సాంకేతిక నైపుణ్యంతో మంచి ఉద్యోగాలు కూడా సాధించి ఉన్నతశిఖరాలను అందుకోవాలని, సమున్నతమైన లక్ష్యాలను సాధిస్తూ తద్వారా దేశానికే మార్గదర్శకులు కావాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకంలో ప్రముఖ విద్యావేత్తలు ఏ.గోపీకృష్ణ, కె.చెంగ ల్రాయచెట్టి, డా. జి.రమణయ్య, వి.కృష్ణమూర్తి, ఆర్.సురేష్, డా.ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్.గమనం, కెవిస్ రాఘవాచార్యులుతో పాటు డా. ఎస్సార్కే స్కూల్ కరెస్పాండెంట్.. కాలేజ్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ పి.కృష్ణమూర్తి రాసిన వ్యాసాలు విద్యార్థిలోకానికి వెలుగు బాటలు చూపుతాయన్నారు. విద్యార్థులకు, యువతకు మొత్తంగా సమాజానికి కరదీపికగా ఈ పుస్తకాన్ని రూపొందించి, ఉచితంగా అందరికీ అందించడానికి కృషిచేసిన డా.ఎస్సార్కే స్కూల్ కరెస్పాండెంట్ పి.కృష్ణమూర్తి అభినందనీయులని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివి విద్యార్థులకు ఇందులోని అంశాలను వివరించి, వారు సాంకేతిక విద్యవైపు మొగ్గుచూపేలా చూడాలని ఈ ఆవిష్కరణోత్సవంలో పాల్గొన్న పలువురు వక్తలు సూచించారు. వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం సభకు నిర్వహించారు. పలువురు విద్యారంగ ప్రముఖులు, ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు, విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

# ఎప్పటికి పూర్తవుతుంది?

**- రాజ్యసభలో విపిఆర్ ప్రశ్న**



నెల్లూరుజిల్లాలోని జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ విషయమై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈనెల 6న పలు ప్రశ్నలు సంధించారు. ఈ హార్బర్ నిర్మాణ వ్యయం వివరాలను అడుగుతూ, అది ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. అందుకు, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ, 2020లో సెంట్రల్ సెక్టార్ స్కీమ్ కింద నీలి విప్లవం సమీకృత అభివృద్ధి మరియు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వశాఖ, ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణాశాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ మోడ్‌లో సాగరమాల పథకం కింద జువ్వలదిన్నె ప్రాజెక్టు మంజూరైందని పేర్కొన్నారు. 2021 సెప్టెంబరులో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.288 కోట్లలో కేంద్రం వాటా 138.29కోట్లని వివరించారు. దీనిని పూర్తి చేయడానికి నాలుగు సంవత్సరాల వ్యవధి కేటాయించామన్నారు. ఈ ప్రాజెక్టును ఫిబ్రవరి 2028 నాటికి పూర్తి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించినట్లు తెలిపారు. దీనికి కేంద్ర వాటా రూ.138.29 కోట్లలో మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ రూ.69.125కోట్లు, ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా శాఖ సాగరమాల ప్రాజెక్టు కింద కేటాయించిన 69.125 కోట్ల నిధుల్లో నీలివిప్లవం కింద రూ.69.15, రూ.62.23 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి వివరించారు.

# పరీక్షలకు వేళాయె!..

**మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్**
**18 నుంచి టెన్త్ పరీక్షలు**

పరీక్షల సమయం వచ్చేసింది. టెన్త్, ఇంటర్ విద్యార్థి లోకమంతా పరీక్షలకు సిద్ధమవుతున్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఈనెల 6న జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 81 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలకు 52,076 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 25,202 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 24,243, ఒకేషనల్ విద్యార్థులు 2,631 మంది ఉన్నారని చెప్పారు. అదేవిధంగా, మార్చి 18వతేదీ నుంచి 30తేదీ వరకు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం12.45 గంటల వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 176 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న 10వ తరగతి పరీక్షలకు మొత్తం 32,834 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



## టోక్యో 'ఆటోమోటివ్ ఎక్స్‌పో'లో..

# మెరిసిన శ్రీసిటీ

దేశంలోని ప్రముఖ పారిశ్రామిక నగరం శ్రీసిటీ, గత వారం జపాన్‌లోని టోక్యోలో జరిగిన ఆటోమోటివ్ వరల్డ్-2024 ఎక్స్‌పోలో పాల్గొని, ప్రపంచస్థాయిలో ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా తన ప్రాధాన్యతను చాటుకుంది. ఆటోమోటివ్ సాంకేతికతకు సంబంధించి ఆసియాలో అతిపెద్ద ఈ ఎగ్జిబిషన్ (16వ ఎడిషన్)లో పారిశ్రామిక దిగ్గజాలు, ఆవిష్కర్తలు, ఔత్సాహికులను ఒకచోట చేర్చి ఆటోమోటివ్ రంగ భవిష్యత్తు ప్రణాళికలు, తాజా పురోగతిపై చర్చించడం జరిగింది. ఈ నేపథ్యంలో తాము రూపొందించుకున్న మార్కెటింగ్ సూత్రాలు, ప్రణాళికల మేరకు శ్రీసిటీ మార్కెటింగ్ బృందం, ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పెట్టుబడిదారులకు ఇచ్చిన సమగ్ర వివరణ, ప్రపంచస్థాయి పారిశ్రామిక కేంద్రమైన శ్రీసిటీపై గణనీయమైన ఆసక్తిని పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాలు, అటానమస్ డ్రైవింగ్, కనెక్టడ్ కార్ల అత్యాధునిక పురోగతిని ఈ కార్యక్రమంలో ప్రదర్శనిచ్చారు. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా పలు ప్రత్యేకతలను హైలైట్ చేస్తూ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డెప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) గోపీకృష్ణ స్టాల్ సందర్శకులకు శ్రీసిటీ అగ్రశ్రేణి మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అభివృద్ధిని, శ్రీసిటీ హబ్‌లో తయారీ యూనిట్లను స్థాపించడంవల్ల కలిగే వివిధ ప్రయోజనాలను వివరించారు. ఆటోమోటివ్ వరల్డ్-2024 ఎక్స్‌పోలో శ్రీసిటీ భాగస్వామ్యం విజయవంతమైందని, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని పరివ్యాప్తం చేయడానికి ఇదొక మంచి వేదికని ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు, ముఖ్యంగా తమ జపనీస్ భాగస్వాములకు ఈ ఈవెంట్ అత్యంత విలువైనదని ఆయన అభివర్ణించారు. ఈ భాగస్వామ్యం శ్రీసిటీకి మరింత పురోగతికి, ప్రత్యేకించి ఆటోమోటివ్ తయారీరంగంలో నిరంతర వృద్ధికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

# వాకా మంజులకు..'తెలుగు భాషా సేవారత్న' పురస్కారం



ప్రముఖ పాత్రికేయురాలు, సీనియర్ మహిళా జర్నలిస్టు, తెలుగు భాషాభ్యున్నతికి ఎంతోకాలంగా తనవంతు సేవలందిస్తున్న మన నెల్లూరుసీమ వాసి..వాకా మంజులకు 'తెలుగు భాషా సేవారత్న' పురస్కారం లభించింది. పాత్రికేయ, సినీరంగాల్లో విశేష సేవలందిస్తున్న రచయితలు, రచయిత్రులకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏపీఎస్ఆర్‌టీ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పలువురికి జీవన సాఫల్య పురస్కారాలను, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలను అందజేసి గౌరవించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకా మంజులకు 'తెలుగు భాషా సేవారత్న' అవార్డునిచ్చి సత్కరించారు. సమాజాన్ని ప్రభావితం చేసే విభిన్నమైన అంశాలను ప్రస్తావిస్తూ, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మహిళలను పరిచయం చేస్తూ ఆమె పత్రికల్లో అనేక కథనాలను అత్యద్భుతంగా రాశారు. 'లాయర్' వారపత్రికలో కూడా ఆమె గతంలో 'వీక్షణం' పేరుతో తనదైన శైలిలో అనేక వ్యాసాలను రాసి పేరుగాంచారు. రాష్ట్రస్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డు నందుకున్న మంజులమ్మను అభినందిస్తూ, శుభాకాంక్షలు చెప్తోంది 'లాయర్'!




### నిబంధనలు పాటిస్తేనే...
# సురక్షిత ప్రయాణం

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అప్రమత్తంగా ప్రయాణిస్తేనే సురక్షితంగా గమ్యం చేరుకుంటామని జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాల్లో భాగంగా ఈనెల 4న జిల్లా రవాణాశాఖ, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి, ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ప్రజల్లో రోడ్డు భద్రత నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం కూడా కుటుంబాలను రోడ్డున పడేస్తుందని, ఆ విషయాన్ని గుర్తుంచుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించకపోవడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ ప్రయాణించడం, మద్యం తాగి వాహనం నడపడం వంటి నిర్లక్ష్యపు చర్యలవల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. తొలుత జిల్లా రవాణా శాఖ అధికారి చందర్ 'రోడ్డు ప్రమాదాలు– నివారణ చర్యల'పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శేషయ్య, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు,పాల్గొన్నారు.

### పీసీసీ అధికార ప్రతినిధిగా..
## లేళ్లపల్లి



ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధికార ప్రతినిధిగా జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లేళ్లపల్లి సురేష్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఆ పదవికి లేళ్లపల్లి పేరును డీసీసీ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రతిపాదించినట్లు సమాచారం.

## జడ్పీకి కొత్త సీఇఓ

నెల్లూరు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఇఓ)గా కన్నమనాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న ఆయన్ను నెల్లూరుకు బదిలీ చేశారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న బి.చిరంజీవి డెప్యూటీ సీఇఓగా కొనసాగనున్నారు.

## డీఇఓగా రామారావు

నెల్లూరుజిల్లా విద్యాశాఖ అధికారి (డీఇఓ)గా బాపట్ల జిల్లా ఎఫ్ఏసి డిఇఓగా పనిచేస్తున్న పీవీజె రామారావును నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 6న ఉత్తర్వులు జారీచేసింది. నెల్లూరులో డిఇఓగా విధులు నిర్వహిస్తున్న గంగాభవానికి వయోజన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు.

## డీఎస్‌ఓగా వెంకటరమణ

నెల్లూరుజిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా వెంకటరమణను ఈనెల6న బాధ్యతలు స్వీకరించారు. ఆ స్థానంలో డీఎస్‌ఓగా ఉన్న వెంకటేశ్వర్లును ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేయడంతో, ఖాళీగా ఉన్న ఆ పోస్టులో శ్రీకాకుళం డిఎస్ఓ వెంకటరమణను నియమించారు.




# నెల్లూరు కబుర్లు

## ఓటు నమోదు చేసుకోండి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన వారంతా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, 'మీ ఓటు–మీ హక్కు'గా వినియోగించుకోవాలని నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. ఓటు హక్కు నమోదుకు ఇటీవల ఆయన రెండు భారీ వాహనాలను కేటాయించి, స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో వాటికి జెండా ఊపి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పిస్తూ జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.




## వేడుకగా.. తెలుగు సినిమా పుట్టిన రోజు



ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో, ఆ సంస్థ డివిజన్ కోఆర్డినేటర్ కళాంజలి అనంత్ సారథ్యంలో ఈనెల 6న తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పురప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎంపీ ఆంజనేయులు తదితరులు పాల్గొని కేకును కట్ చేసి అందరికీ పంచారు. తెలుగు సినిమా మూకీ నుంచి టాకీగా 1932 ఫిబ్రవరి 6న ఆవిర్భవించిందని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకగా జరుపుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం, సీనియర్ రంగస్థల–సినీ ప్రముఖులు రేబాల శ్రీలక్ష్మి, మల్లిబాబు, శ్రీకంఠం నాగరాజరావులను ఆత్మీయంగా సన్మానించారు. దువ్వూరు బెనర్జీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఫిల్మ్ చాంబర్ సభ్యులు మల్లికార్జునరావు, ప్రణవ్, శివప్రసాద్, కోడూరు శైలజ తదితరులతో పాటు శ్యాంసన్, దోర్నాల హరిబాబు, మురళీమోహన్‌రావు, జిల్లాలోని పలువురు నటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## అలరించిన.. అన్నమయ్య కీర్తనలు



గట్టుపల్లి లలితాంబ శత జయంతి సందర్భంగా నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన 'అన్నమయ్య సౌరభాలు' సంకీర్తనల కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. ప్రఖ్యాత మృదంగ కళాకారులు, కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు కాసూరి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో టీటీడీ గాయకులు వాసా ప్రసాద్, కుమారి పి. వైష్ణవి గానం చేసిన పలు సంకీర్తనలు వీనులవిందు చేశాయి. వయొలిన్‌పై చావలి ప్రసాద్, కీ బోర్డ్ సాయి, తబలా లక్ష్మీనారాయణ, మృదంగంపై రామకృష్ణ వాద్య సహకారం అందించారు. అనంతరం గట్టుపల్లి కుటుంబ సభ్యులు 'గసల్' సంస్థ తరపున కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాళ్ళు జె. బాలార్క, ఎస్. పద్మాసని, ఎ.విద్యాసాగర్, వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి ఆదిశేషు, గట్టుపల్లి మురళి, జయచంద్ర, డాక్టర్ డి.వి.ఎస్.శాస్త్రి, దుర్భా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి గట్టుపల్లి శశికళ వందన సమర్పణ చేశారు.



## పర్వతరెడ్డికి..సీఎం పలకరింపు

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 6న ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం తాడేపల్లిలో ఆయన ముఖ్యమంత్రిని కలిసినప్పుడు జగన్ ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో పర్వతరెడ్డి గాయపడిన నేపథ్యంలో, ఆయన ఆరోగ్యం ఇప్పుడెలా ఉందని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని సీఎం పర్వతరెడ్డికి సూచించారు. అనంతరం, తాజా రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ, పర్వతరెడ్డికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

## డాక్టర్ సీవీకి అరుదైన గౌరవం

- ఆయుష్మాన్ భారత్ కమిటీలో స్థానం



నెల్లూరులోని ప్రముఖ వైద్యులు, జయభారత్ ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యంకు అరుదైన గౌరవం లభించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖలో నామినేటెడ్ పదవి దక్కింది. ఆ మేరకు, ఆయుష్మాన్ భారత్‌లో డిజిటల్ మిషన్ సభ్యులుగా ఆయన్ను నియమిస్తూ కేంద్ర ఆరోగ్యమంత్రి నుంచి ఇటీవల ఆయనకు ఉత్తర్వులందాయి. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని పటిష్టంగా అమలుచేయడం కోసం నియమించిన ఈ కమిటీకి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా మన రాష్ట్రం నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం లభించింది. అందులో ఒకరు మన నెల్లూరీయులైన డాక్టర్ సీవీ కావడం విశేషం. తొలినుంచి నిబద్ధతతో పనిచేసే వైద్యులుగా, ప్రముఖ ఫిజిషియన్‌గా ఆయన ప్రసిద్ధి. వైద్యరంగంలో ఎంతో అనుభవం ఉన్న వారు. అంతేకాదు, ఆర్ఎస్ఎస్ నెల్లూరు శాఖకు ఆయన అధ్యక్షులుగా ఉన్నారు కూడా. ఈ సందర్భంగా, తన నియామకానికి సహకరించిన సంఘ్ ప్రముఖులకు, ఆయుష్మాన్ భారత్ కమిటీలో తనను నియమించిన కేంద్రమంత్రికి, డాక్టర్ సీవీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. తనమీద నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

## యోగాలో ఆణిముత్యాలకు సన్మానం



యోగాలో అద్వితీయమైన ప్రతిభతో అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ బహుమతులు సాధిస్తూ జిల్లాకు కీర్తిని తెస్తున్న పలువురు యోగా క్రీడాకారిణులను ఇటీవల జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ యోగా పోటీల్లో పతకాలు సాధించిన యోగా క్రీడాకారిణులు కావ్యశ్రీ, స్వప్న, అరుణలను అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు ప్రసన్న, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



## అవకాశం ఇవ్వండి..

# సేవకుడిలా పనిచేస్తా!

### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎవరినీ మాయమాటలతో మోసం చేయడం తనకు చేతకాదని, ప్రజలు అవకాశం ఇస్తే వారికి తాను సేవకుడిలా పనిచేస్తానని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 6న ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో తనను కలిసేందుకు వచ్చిన ప్రముఖులు, ప్రజలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే తమ తండ్రి..మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి, తల్లి నేదురుమల్లి రాజ్యలక్ష్మిలను మరిపించేలా వెంకటగిరి పట్టణం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తామని ఆయన వారికి తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు తన తండ్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలకు ఈ ప్రాంత ప్రజానీకానికి సేవ చేయడంతో పాటు వెంకటగిరిని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపే అవకాశం ఇచ్చారని, అదే తరహాలో తనకు సేవచేసే అవకాశాన్ని ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంకటగిరి పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులకు, టైలర్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని, ఇతరుల మాదిరిగా కల్లబొల్లి మాటలు చెప్పే అలవాటు తనకు లేదని స్పష్టం చేశారు. అనంతరం పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు.

### కలసికట్టుగా పనిచేద్దాం :

వాకాడులోని నేదురుమల్లి నివాసంలో వాకాడు, చిట్టమూరు, కోట, చిల్లకూరు మండలాల వైకాపా నాయకులతో ఇటీవల రామ్‌కుమార్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో నాయకులందరూ కలిసిమెలిసి పనిచేసి వైకాపా అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.

## • విపిఆర్‌కు అరుదైన ఘనత

# రాజ్యసభ ఛైర్మెన్ పీఠంపై..మన వేమిరెడ్డి

రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అరుదైన ఘనతను దక్కించుకున్నారు. రాజ్యసభ ఛైర్మన్ పీఠంపై ఆసీనులై, ప్యానెల్ వైస్ ఛైర్మెన్‌గా సభను నడిపించి తన ప్రతిభను చాటుకున్నారు. ఈనెల 5న మధ్యాహ్న భోజన విరామం అనంతరం రాజ్యసభ ప్యానెల్ వైస్ ఛైర్మెన్ హోదాలో విపిఆర్ సభను నిర్వహించడం విశేషం. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మెన్ జగ్‌దీప్ ధన్‌కర్ స్థానంలో విపిఆర్ ఆసీనులై సభను




సజావుగా నడిపించడం సభ్యులందరినీ బాగా ఆకట్టుకుంది. 2018, ఏప్రిల్‌లో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ నెలతో ముగియనుంది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులుగా ఆయన అందించిన విశేష సేవలకు గుర్తుగా రాజ్యసభ ఛైర్మెన్ జగ్‌దీప్ ధన్‌కర్ ఆయన్ను ప్యానెల్ వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నెల 5న ఆయన ఛైర్మెన్ స్థానంలో ఆసీనులై సభను జయప్రదంగా నడిపించి అందరి ప్రశంసలందుకున్నారు.

## • వేమిరెడ్డి దంపతుల వితరణ

# 'స్విమ్స్'కి రూ. 3 కోట్ల విలువైన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు

తిరుపతిలోని 'స్విమ్స్' ఆసుపత్రికి 3 కోట్ల రూపాయల విలువచేసే మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును వేమిరెడ్డి దంపతలు ఈనెల 5న బహుకరించారు. రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టీటీడీ ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహా మండలి–న్యూఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఈ వితరణ చేశారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ పింక్ బస్సును టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్



రెడ్డి, ఈవో ధర్మారెడ్డికి అప్పగించారు. స్విమ్స్ ఆసుపత్రికి మూడు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను అందించాలని తిరుపతి జిల్లా యంత్రాంగం టీటీడీని కోరగా, ఆ సమాచారం తెలుసుకున్న వేమిరెడ్డి దంపతులు ఒక బస్సును తమ దాతృత్వంతో అందజేయడం అభినందనీయమని టీటీడీ బోర్డు ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఈ పింక్ బస్సు మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, జేఇఓ సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, క్యాన్సర్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.




8వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు

చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్ ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)
పరమపదించి తేది. 9.2.2024 నాటికి ఎనిమిదేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)
మనుమరాలు, మనుమడు
ప్రణీత అరవింద్, లోహిత్, యు.యస్.ఏ
మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
మనుమరాలు - మనుమడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత     కీర్తన లక్ష్మి & తనవ్

# అభివృద్ధిలో అగ్రగామిగా నెల్లూరు రూరల్

**- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



అవినీతి రహిత సంక్షేమం, అన్ని రంగాలలో సమాన అభివృద్ధిని అందించే వ్యక్తులు కావాలా..లేకపోతే అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలను పెంచి పోషించే వ్యక్తులు కావాలా?.. ప్రజలే ఆలోచించి నిర్ణయించుకోవాలని, ప్రజలే నిర్ణేతలని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన స్థానిక బాబు జగజ్జీవన్‌రామ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ, పార్లమెంటు, కార్పొరేషన్, జడ్పీ, ఇతరత్రా విభాగాల నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేలా తాము కృషిచేస్తున్నామని ఆదాల చెప్పారు. అభివృద్ధి-ప్రజాసంక్షేమాన్ని కోరుకునే వైకాపాను రానున్న ఎన్నికల్లో ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. 23వ డివిజన్ అభివృద్ధి నిర్మాణ పనులకు ఇప్పటివరకు 9కోట్ల 70లక్షల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా బాబు జగజ్జీవన్‌రామ్‌నగర్ అభివృద్ధి నిర్మాణ పనులకు కోటి రూపాయల నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం 23వ డివిజన్ కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి సొంత నిధులతో ఏర్పాటుచేసిన దోమల ఫాగింగ్ మిషన్‌ను ఈ సందర్భంగా ఎంపీ ఆదాల, నగర మేయర్ పొట్లూరు స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు ప్రారంభించారు. ఏఎంసి ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్యతో పాటు స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ ప్రగతి స్ఫూర్తిదాయకం

చెన్నైలోని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ వి.జార్జ్‌జెన్నర్ ఈనెల 5న శ్రీసిటీని సందర్శించారు. ఈ పర్యటనలో యువరాజ్ (డెప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్, చెన్నై), బాలాజీ (అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్), ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్, విజయవాడ, రామాయపట్నం పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి ఘన స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ముఖ్య అంశాలను వివరించారు. శ్రీసిటీలో ప్రకృతికి ఇస్తున్న ప్రాధాన్యతను పేర్కొంటూ, 'స్వచ్ఛమైన వాతావరణంలో పరిశ్రమలు మరియు జీవావరణం మధ్య సామరస్య సమ్మేళనాన్ని ఈ సందర్భంగా డాక్టర్ జార్జ్ జెన్నర్ ప్రశంసించారు. శ్రీసిటీ ఏర్పాటుకు డాక్టర్ సన్నారెడ్డి కృషిని కొనియాడుతూ, చెన్నైకి అత్యంత సమీపంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో శ్రీసిటీని అత్యద్భుతంగా ఏర్పాటుచేయడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో, దేశవిదేశాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పరచి, వేలాది మంది స్థానిక ప్రజలకు శ్రీసిటి జీవనోపాధిని కల్పించటం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వారందరూ శ్రీసిటీలోని పలు ప్రాంతాలను సందర్శించారు.

## ప్రశంసించిన ఉన్నతాధికారుల బృందం



## మరింత బలపడుతున్న శ్రీసిటీ-జపాన్ వ్యాపారబంధం

శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం మరింతగా బలపడుతోంది. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సారధ్యంలో శ్రీసిటీ మార్కెటింగ్ బృందం చొరవతో అందుకు అడుగులు పడుతున్నాయి. గత వారం టోక్యో ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పోలో శ్రీసిటీ పాల్గొనడంతో పాటు, ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తూ చురుకైన మార్కెటింగ్ ప్రణాళికలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు ఆర్.వీరారెడ్డి, జమైకాలోని జపాన్ మాజీ రాయబారి, శ్రీసిటీకి సలహాదారు మసనోరి నకనో, శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డెప్యూటీ జనరల్ మేనేజర్(మార్కెటింగ్) గోపీకృష్ణ పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా వారు శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రస్తుతం 28 దేశాల చెందిన 210 కంపెనీలు శ్రీసిటీలో ఏర్పాటయ్యాయని, అందులో జపాన్ పరిశ్రమలు 30 ఉన్నట్లు వారు చెప్పారు. శ్రీసిటీని భారతదేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా వారు అభివర్ణించారు. జపాన్‌తో శ్రీసిటీ వ్యాపార బంధం మరింత బలోపేతం అవుతుందంటూ శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## ప్రమాదాలు జరిగినప్పుడు

# బాధ్యతగా వ్యవహరించాలి

**ఆర్టీఓ ఆదినారాయణ**



రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను సకాలంలో ఆసుపత్రుల్లో చేర్పిస్తే కేంద్రప్రభుత్వం రూ. 5వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తుందని ఆర్టీఓ ఆదినారాయణ తెలిపారు. ఈ నెల 5వ తేదీ పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గోడపత్రికలను విడుదల చేసి, ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని అన్నారు. ఎంవీఐ సునీల్, పట్టణ సిఐ పాపారావు, ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ షరీనా తదితరులు పాల్గొన్నారు.

## ఓజిలి ఎస్సైకి ఆటోడ్రైవర్ల శుభాకాంక్షలు



ఓజిలి ఎస్సైగా రవిబాబు నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో ఓజిలి ఆటో డ్రైవర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటో డ్రైవర్లు ఎన్.కాలేషా, మాబు బాషా, కస్తూరయ్య, దాసరి సాయి ప్రసాద్, మునగపాటి వెంకటేశ్వర్లు, కాటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేలా చర్యలు



**- ఆర్డీఓ కిరణ్‌కుమార్**

ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 5న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించగా డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన సిఐటియు నాయకులు



గూడూరులో కొత్తగా బాధ్యతలు తీసుకున్న మున్సిపల్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లును సోమవారం పలు సమస్యలపై సి.ఐ.టి.యు నాయకులు కలిశారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలోని పాఠశాలలో స్వీపర్లుగా పనిచేస్తున్న కార్మికులకు గత 16 నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, వారికి పూట గడిచేదే కష్టంగా ఉందని కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి, వారికి న్యాయం జరిగేటట్లుగా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాప్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో మంచినీటి బోర్లు మరమ్మతులకు గురై చాలా కాలమైందని సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య కమిషనర్ దృష్టికి తీసుకురాగా, మెటీరియల్ రాగానే బోర్లు మరమ్మత్తులు చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు శివ కుమార్, సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు మధు, మణి, ఎస్.ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నోబెల్ వరల్డ్ రికార్డ్‌లో సంధ్యారాణి



గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి యోగా విభాగంలో నోబెల్ వరల్డ్ రికార్డు సృష్టించినట్లు వసంత యోగ అకాడమీ నిర్వాహకురాలు వసంతలక్ష్మి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వసంత యోగ అకాడమీ ఆధ్వర్యంలో గత నవంబర్‌లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన యోగా పోటీలలో సంధ్యారాణి సూర్యనమస్కారాల విభాగంలో నోబెల్ రికార్డు సాధించారు. అతి తక్కువ సమయంలో 108 సార్లు సూర్యనమస్కారాలు చేయడంతో ఆమె ఈ రికార్డు సృష్టించినట్లు న్యూఢిల్లీకి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. రికార్డ్ సృష్టించిన సంధ్యారాణి ఆదివారం గూడూరు పట్టణంలోని ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు యోగ అలవాటు చేసుకోవాలని అభిలషించారు. యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటామని పేర్కొన్నారు .

## 'ప్రగతి' పౌష్టికాహార పంపిణీ



గూడూరు ప్రగతి సేవా సంస్థ ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. 'డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణిల సహాయసహకారాలతో ఈ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ ఈ సేవా కార్యక్రమాల రూపంలో ఆయన చిరస్మరణీయులుగా ఉంటారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షేక్ షరీనా, కాటూరు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కష్టపడేవారికి.. బీజేపీలో సముచిత స్థానం

### మహిళామోర్చా రాష్ట్ర నేత శైలజ

పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని, రానున్న ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కలసికట్టుగా కృషిచేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి శైలజ చెప్పారు. నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఈనెల 4న ఆమె బీజేపీ జోనల్ ఇన్‌ఛార్జి చిగురుపాటి లక్ష్మితో కలసి జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి అధ్యక్షత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోడీ పేదల అభ్యున్నతి కోసం, ప్రత్యేకించి మహిళల సాధికారత కోసం అందజేస్తున్న అనేక సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కలిగేవిధంగా వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి, నాయకురాళ్ళు రాజేశ్వరి, గంటా విజయశ్రీ, లక్ష్మీప్రసన్న, సుజన తదితరులు పాల్గొన్నారు.

## బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

### వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల



రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతి చంద్రబాబునాయుడి నాయకత్వంలోని ఒక్క టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఈనెల 4న ఆయన కలువాయి టీడీపీ కార్యాలయంలో 'జయహో బీసీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వంలో బీసీలను పట్టించుకోవడం లేదని, కేవలం ఉత్తుత్తి పదవులిచ్చి నాయకులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని దుయ్యబట్టారు. ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలనకు స్వస్తిపలకాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు బి.మస్తాన్‌యాదవ్, నగర అధ్యక్షుడు చిల్లకూరు ప్రసాద్, బీసీ నాయకులు ఏ.మల్లికార్జునయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు, జన్ని రమణయ్య, మునుస్వామి, సదాశివం, గడ్డం కిషోర్‌రెడ్డి, పీర్ల సోమయ్య, చీపినాపి సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనసేన-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

### జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి కూసంపూడి



రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి కూసంపూడి శ్రీనివాసులు చెప్పారు. ఈనెల 4న ఆయన కావలిలో నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ త్వరలో కావలికి వస్తారని, అప్పుడు ఈ కార్యాలయాన్ని సందర్శించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అళహరి సుధాకర్‌ను కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నియమించారని, నాయకులకు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకుడు అళహరిని అందరూ ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి నియోజకవర్గ అధికార ప్రతినిధి మన్నేపల్లి రుషీకేష్, రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు శ్రీనాథ్, కో-ఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, నాయకులు బెల్లంకొండ మస్తాన్, అగస్టీస్, క్రిష్ణయ్య, మంద శ్రీను, ఫణి, మనోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో

## ఆనం గెలుపు ఖాయం

రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం అభ్యర్థిగా పోటీచేయనున్న మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి గెలుపు ఖాయమని పార్టీవర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 4న అనంతసాగరం మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, త్వరలోనే ఆయన ఎన్నికల ప్రచారానికి రానున్నారని, ఆనం సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని అన్నారు. మండలంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త ఆనం విజయానికి, తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి పట్టుదలతో కృషిచేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల కోసం చేపట్టనున్న సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

### చంద్రబాబుతోనే

## యువతకు భవిత



### - మాజీమంత్రి నారాయణ

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే యువతకు భవిత సాధ్యమవుతుందని మాజీమంత్రి, టీడీపీ నాయకుడు పొంగూరు నారాయణ అన్నారు. ఈనెల 4న నెల్లూరు నగరంలోని 6, 48 డివిజన్లలోని పొర్లుకట్ట, ఉడ్‌హౌస్‌సంఘం తదితర ప్రాంతాల్లో ఆయన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి వైకాపా వైఫల్యాలను, అధికారంలోకి వస్తే టీడీపీ చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైకాపా పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోవడంతో యువత భవిష్యత్తు అంధకారమయంగా తయారైందని, జగన్‌కు రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలన్న ఆలోచనే లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఘనవిజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకులు కరిముల్లా, రాజానాయుడు, విజేతరెడ్డి, సత్యనాగేశ్వరరావు, పెంచలబాబు, కీర్తి, పఠాన్ నూర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరని జగన్ హామీ

పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరకపోవడం విచారకరమని యుటిఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దుచేయాలంటూ పోస్టర్లను ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా నేతలు వి.వి శేషు, జీవీ చలపతిశర్మ, ఏ.మురళీధర్‌రావు, కె.నాగిరెడ్డి, ఇ.బాలరాగయ్య, ఎస్‌కె ఖాజా వలీ, ఆర్.శీనయ్య పాల్గొన్నారు.



## కాకాణి చేసిన అభివృద్ధి ఏదీ?

### మాజీమంత్రి సోమిరెడ్డి ఎద్దేవా

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శిలాఫలకాలు తప్ప, జిల్లాకు ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈనెల 4న సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లిగూడూరు మండలం మాచర్లవారిపాళెంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టి, ఇంటింటికీ తిరిగి వైకాపా పాలనలోని వైఫల్యాలను ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్క ఛాన్స్ అని ప్రజలు వైకాపాకు అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనమైపోయిందన్నారు. ఇక మళ్ళీ ఆ పార్టీకి ఛాన్స్ ఇవ్వవద్దని కోరారు. జిల్లాలో విపత్తుల కారణంగా నష్టపోయిన రైతాంగానికి మంత్రి కాకాణి చేసిందేమీ లేదన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా సర్వేపల్లిలో దౌర్జన్యాలు పెరిగిపోయాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఇవన్నీ ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మండల నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, పొన్నలూరు శివకోటారెడ్డిల సారథ్యంలో 70కుటుంబాలను సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, తూపిలి సుధాకర్‌రెడ్డి, శ్రీనాథ్, షేక్ షఫీ, అల్లాభక్షు, కె.వెంకటరమణయ్య, వెంకటశేషయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## జానీమాస్టర్ జనసేనలోకి రావడం సంతోషకరం

### - వేములపాటి అజయ్



ప్రముఖ సినీ నృత్యదర్శకుడు జానీమాస్టర్ 'జనసేన' పార్టీలో చేరడం అభినందనీయమని, పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలను విశ్వసించి, ప్రజలకు సేవ చేయాలనే సదాశయంతో ఆయన పార్టీలోకి రావడం సంతోషకరమని జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ అన్నారు. ఈనెల 4న నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో జానీ మాస్టర్ పరిచయ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజయ్ మాట్లాడుతూ, గొప్ప కొరియోగ్రాఫర్‌గా పేరొందిన జానీమాస్టర్ నెల్లూరు బిడ్డ కావడం గర్వకారణమన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో అందరం కలసి సమిష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, జనసేన నాయకుడు గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రానున్నది టీడీపీ ప్రభుత్వమే!

### నాయకులు దినేష్‌రెడ్డి-మనుక్రాంత్‌రెడ్డి



ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రజాప్రభుత్వం త్వరలోనే వస్తుందని, రానున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ధీమాగా చెప్పారు. ఈనెల 4న ఆయన కోవూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బంలో 'ప్రతి అడుగు ప్రజల కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌రెడ్డితో కలసి ఆయన స్థానిక కోదండరామస్వామి వారి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం, ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలుసుకుని మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, వైకాపా ప్రభుత్వంలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని, ఉద్యోగాలు లేక వేలాదిమంది యువతీ యువకులు నిరాశలో కొట్టుమిట్టాడతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చివరికి ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని దినేష్‌రెడ్డి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా సర్వనాశనమైపోయిందని విమర్శించారు. మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీలు కలసి వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమన్నారు. టీడీపీ కన్వీనర్ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట్, మాజీ ఎంపీపీ రమణమ్మ, జనసేన నాయకులు సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కమలనాథుల 'పద్మ'వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

## ఆంధ్రాపై కన్ను!

దక్షిణాన కాషాయ జెండా ఎగురవేసే క్రమంలో కమలనాథులు ముందుగా ఆంధ్రప్రదేశ్‌పై దృష్టిపెట్టినట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రాలో తలపడుతున్న రెండు ప్రధాన పార్టీలూ ప్రాంతీయపార్టీలే. తెలుగుదేశం, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీలతో సమానంగా మూడవపార్టీగా అవతరించడానికి జనసేన పార్టీ అధ్యక్షుడు గత దశాబ్దకాలంగా పాట్లు పడుతున్నారు. ఆయన ఎంత తపించినా అవి సర్కస్ ఫీట్లుగానే మిగిలిపోతున్నాయి తప్ప ఫలితం కనిపించడం లేదు. మరో రెండు నెలలో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తాడోపేడో తేల్చుకోవడానికి ఆయన సిద్ధమయ్యారు. మరోవైపు చంద్రబాబుకి కూడా ఈ ఎన్నికలు అత్యంత కీలకం. ఆయనకి ఇవే చివరి ఎన్నికలని ఆ పార్టీ శ్రేణులు కూడా భావిస్తున్నారు. మొత్తం 175 స్థానాలు తామే గెలుస్తామన్న బీరాలు పలుకుతున్న వైసీపీ అధిష్టానం ఇంతవరకు పూర్తిస్థాయిలో అభ్యర్థులని కూడా ప్రకటించలేకపోతోంది. పార్టీలో వినిపిస్తున్న అసమ్మతి స్వరాలని నియంత్రించలేకపోతోంది. మరోవైపు టీడీపీ-జనసేన వేగం పెంచారు. ఇప్పటికే కమలనాథులతో స్నేహం చేస్తున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబుని కూడా వారితో కలపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదే క్రమంలో బుధవారం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షులు జే.పీ. నడ్డాలతో భేటీ అయ్యారు. వారి భేటీ జరిగిన పక్కరోజు, అంటే గురువారం జనసేనాని పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీ విమానం ఎక్కారు. మొత్తానికి ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష రాజకీయం ఢిల్లీ చుట్టూ తిరుగుతోంది.

భాజపా కూడా ఆంధ్రాలో పొత్తుల విషయంలో సంయమనం పాటిస్తూ వ్యూహం రచిస్తోందని అంటున్నారు విశ్లేషకులు. గడచిన ఐదేళ్లలో ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా జగన్‌మోహన్ రెడ్డికే కమలనాథులు తమ ఆశీస్సులు అందించారు. రాష్ట్రానికి చెప్పుకోదగ్గ ప్రయోజనం ఒక్కటి కూడా చేయకపోయినా జగన్ వ్యక్తిగత విషయాలలో మాత్రం ఆయనకి అండగా నిలిచారన్నది జగమెరి గిన విషయం. భాజపా అండదండలు లేకపోతే చంద్రబాబుపై కేసులు బనాయించి ఆయన్ని లోపల మూయించే సాహసం జగన్ చేసివుండలేరన్నది రాజకీయవర్గాల అభిప్రాయం.

## ఎన్నికలు సమీపిస్తున్న వేళ "పద్మ"వ్యూహం!



అన్నదమ్ములొక్కటై బరిలోకి దిగుతారా?

ఢిల్లీ పెద్దలు ఆంధ్ర విషయంలో పట్టీ పట్టనట్టు వ్యవహరించినా, కేంద్ర నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకుం టూనే ఉంటారు. ప్రస్తుతం ఆంధ్రాలో జరుగుతున్న



అమిత్‌షాతో చంద్రబాబు (ఫైల్ ఫోటో)

రాజకీయ పరిణామాల గురించి పూర్తి సమాచారం వారిదగ్గర ఉందంటున్నారు ఆ పార్టీ శ్రేణులు. ప్రస్తుత పరిస్థితులలో భాజపా ఎవరితో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచనలో ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు కూడా మొదలుపెట్టిందని కూడా వారు చెప్తున్నారు. భవిష్యత్తులో ఆంధ్రాలో పార్టీని బలోపేతం చేయాలంటే ఒంటరి పోరాటం వల్ల ఫలితం లేదన్న నిర్ణయానికి పార్టీ పెద్దలు వచ్చారని కూడా అంటున్నారు. రాజకీయంగా జగన్‌మోహన్‌రెడ్డి కంటే చంద్రబాబే సీనియర్. రాజకీయ టక్కు టమారా విద్యలన్నీ తెలిసిన అపర చాణుక్యుడు బాబు. ఒకప్పుడు ఢిల్లీలో సైతం చక్రం తిప్పాడు. పైగా ఇప్పుడు భాజపాతో బహిరంగ స్నేహం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు కూడా.

రాష్ట్రంలో జగన్ బలంగా ఉన్నా, ఆయన భాజపాతో బహిరంగ దోస్తీకి మొగ్గు చూపకపోవచ్చు. పైగా అధికారంలో ఉన్నాడు. అన్యమత పార్టీ అని వైసీపీపై ముద్ర పడడంతో భాజపా కూడా ఆ పార్టీతో స్నేహానికి ఆసక్తి కనపరచకపోవచ్చు. ఇదే ఆలోచనతో కమలం పార్టీ ఢిల్లీ పెద్దలు బాబుతో బేరసారాలకు మొగ్గు చూపించినట్లు విశ్లేషకుల సమాచారం.

ఎలాగూ పవన్ కళ్యాణ్ తమతో ఉన్నారు. బాబుతో కలసి తిరుగుతున్నారు. అధికార వైసీపీ వ్యతిరేక ఓటును చీలనీయమని తరచూ ఊదరగొడుతూనే ఉన్నారు. ఈ తరుణంలో బాబే తమకి సరైన జోడి అని భాజపా వర్గాలు భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇదే ఆలోచనతోనే మెగాస్టార్ చిరంజీవిని "పద్మవిభూషణ్"కి ఎంపిక చేశారని విశ్లేషకులు చెప్తున్నారు. చిరంజీవి తెలుగు సినిమా రంగానికి పెద్ద దిక్కుగా ఉన్నారు. ఎదిగేకొద్దీ ఒదుగుతున్నారన్న మంచిపేరు ఉంది. రాజకీయంగా అనుభవం ఉంది. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఇప్పటికే భాజపాతో ఉన్న పవన్ కళ్యాణ్‌కి స్వయానా అన్న. మరోవైపు దాదాపుగా తెలుగు సినిమా రంగం మొత్తం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉంది. చిరంజీవి, నాగార్జున, మహేష్‌బాబు, ప్రభాస్ వంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న సినిమా హీరోలనందరిని తన క్యాంపు కార్యాలయం వరకు నడిపించి, మీకందరికంటే నేనే పెద్ద హీరో అన్నట్లుగా జగన్ ప్రవర్తించిన తీరుపై సినిమా రంగం గుర్రుమంటోంది. ముఖ్యంగా తమ పరిశ్రమకు పెద్దదిక్కుగా భావించే చిరంజీవి జగన్‌మోహన్‌రెడ్డి ముందు చేతులు కట్టుకుని కూర్చో వడం పరిశ్రమలోని 24 విభాగాల వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకి సమయం వచ్చినప్పుడు తమ నిరసన తెలియ చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

ఇలాంటి పరిణామాలన్నీ దృష్టిలో పెట్టుకుని "పద్మ విభూషణ్" ప్రకటించారని అంటున్నారు. రేపటి ఎన్నికలలోగా ఆయనకి రాజ్యసభ సభ్యత్వం కూడా కట్టబెట్టి ఆంధ్ర ఎన్నికలలో చిరంజీవిని, ఆయన కుటుంబసభ్యులని జనసేన, టీడీపీలతో తమ పార్టీ ప్రచారానికి కూడా బ్రాండ్ అంబాసిడర్ లుగా వాడుకోవాలన్నది కమలనాథుల "పద్మ"వ్యూహంగా విశ్లేషకులు చెప్తున్నారు. వ్యూహం ఫలించి ఫలితాలు అనుకూలంగా వస్తే చిరంజీవికి కేంద్రమంత్రి పదవి కూడా కట్టబెడతారని విశ్లేషకుల ఊహ.

మరో వారం లేదా పది రోజులలో ఈ విషయాలపై స్పష్టత ఏర్పడే అవకాశం ఉంది. రాజకీయవర్గాలు, విశ్లేషకుల అంచనా ప్రకారం పై పరిణామాలన్నీ జరిగి సినీపరిశ్రమ ఆంధ్రలో ఎన్నికల ప్రచారానికి దిగితే, 2024 ఎన్నికలు రంజుగా, మరింత రసవత్తరంగా ఉంటాయనడంలో సందేహం లేదు!








తమను రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేసిన సందర్భంగా తాడేపల్లిలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి.

# వైసీపీకి వీపీఆర్ దూరం!

(మొదటి పేజీ తరువాయి)



జగన్‌తో అత్యంత సన్నిహితంగా విపిఆర్ (ఫైల్ ఫోటో)

నిజమే అయితే... తామంతా ఆయనతోనే ఉంటామని ప్రతిన పూనుతున్నారు. వైసీపీ లాంటి అనైతిక పార్టీని మా నాయకుడు వీడడమే సరైన నిర్ణయమని ముక్తకంఠంతో చెప్తున్నారు. వైసీపీ తొలినుండి తమ నాయకుడి మంచితనాన్ని చేతకానితనంగా తీసుకుంటోందని మండిపడుతున్నారు. నాలుగుజిల్లాల సమన్వయకర్తగా ఉన్న తమ లీడర్‌ని ఒక్క జిల్లాకి అధ్యక్షుడిని చేయడమే వైసీపీ చేసిన తొలి తప్పిదంగా పేర్కొంటున్నారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పుట్టినరోజు ఫ్లెక్సీలను తొలగించిన నాయకులపై పార్టీ క్రమశిక్షణ చర్య తీసుకోకపోవడం అవమానకరంగా భావిస్తున్నారు. ఇప్పుడు వేమిరెడ్డిపై జిల్లా నాయకులు అవాకులు చవాకులు పేలుతుంటే.. పార్టీ పెద్దలు చోద్యం చూస్తూ ఉండడం సిగ్గుచేటని అంటున్నారు. దైవభక్తి, సేవాగుణం, మంచితనం ఉన్న ప్రభాకరరెడ్డి లాంటి వ్యక్తిని దూరం చేసుకోవడం ఆ పార్టీకే తీరని నష్టం అని వేమిరెడ్డి అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఆయన దూరమైతే జిల్లాలో ఆ పార్టీకి గెలుపు ఎంత భారమవుతుందో ఆ పార్టీ పెద్దలే చూస్తారని శాపాలు పెడుతున్నారు. ఇన్నాళ్ళు పార్టీ కోసం కొవ్వొత్తిలా కరిగిన తమ నేతకు చేసిన అవమాన ఫలితం అందుకు కారణమైన వారందరూ అనుభవిస్తారని ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నారు.

## బీజేపీ వైపు వీపీఆర్ చూపు!

గత వారం రోజులుగా ఢిల్లీలోనే ఉన్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వైసీపీ నేతలకి అందుబాటులోకి రావడంలేదు. పార్టీలోని అగ్ర నాయకత్వంలో ఉన్న ద్వితీయశ్రేణి నాయకులు ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేసినా, వాళ్ళతో మాట్లాడడానికి ఆయన సుముఖత చూపించలేదని సమాచారం. జరిగిన అవమానాలు చాలని ప్రభాకరరెడ్డి భావిస్తున్నట్లు వార్త. తన నైజానికి జాతీయ పార్టీయే సరైన వేదిక అని భావించి బీజేపీలో చేరడానికి ఆయన ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే అటు బీజేపీ ఇటు టీడీపీ నేతలు ఆయన ఇంటి తలుపు తడుతున్నా ఇక జీవితంలో ప్రాంతీయపార్టీలలోకి వెళ్ళే ప్రసక్తే లేదని వీపీఆర్ నిర్ణయించుకున్నట్లు ఢిల్లీ వర్గాల భోగట్టా.

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బీజేపీలో చేరినా ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తారా..? పార్లమెంటుకి పోటీ చేస్తారా లేక మళ్ళీ రాజ్యసభకే వెళ్తారా..?? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయవర్గాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఢిల్లీలోనే ఉన్న వైసీపీ అసమ్మతి ఎంపీలు ఇతర పార్టీల నీడలో చేరిన మాగుంట శ్రీనివాసులరెడ్డి, శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి వంటివారు కూడా రోజూ వేమిరెడ్డితో మాట్లాడుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. ఫిబ్రవరి 9వ తేదీ శుక్రవారం నాటితో పార్లమెంటు ఉభయ సభలు ముగియనుండటంతో ఆదివారం నాటికి అన్ని విషయాలలో స్పష్టత వస్తుందని తెలుస్తోంది.

## జిల్లా పార్టీలో పెద్ద కుదుపు!

వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఏర్పడినప్పటి నుండి నూటికి నూరు శాతం ఆ పార్టీకి అండగా నిలచిన జిల్లా నెల్లూరు. వరుసగా 2014, 2019లలో జరిగిన ఎన్నికలలో రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు సాధించిన ఘనత నెల్లూరు జిల్లాది. మొత్తం 10 సీట్లలో 2014లో 7 స్థానాలని, 2019లో మొత్తం పదికి పది స్థానాలని వైసీపీ కైవసం చేసుకుంది. అంతేకాదు, 2022లో జరిగిన మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మొత్తం 54 కార్పొరేటర్ స్థానాలని వైసీపీయే దక్కించుకుంది. అంతలా ఆ పార్టీని ఆదరించారు నెల్లూరీయులు. నియోజకవర్గాల పునర్ విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత నెల్లూరుజిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు మిగిలాయి. రేపు జరగబోయే ఎన్నికలలో వైసీపీ ఎన్ని సీట్లు సాధిస్తుందన్నది కూడా ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. జరుగుతున్న పరిణామాలు, పార్టీలో సంభవిస్తున్న మార్పులు చూస్తే కనీసం సగం సీట్లలోనన్నా తమ పార్టీ విజయం సాధిస్తుందా..? అన్న సందేహం కలుగుతోందని ఆ పార్టీ శ్రేణులే అనుమానం వ్యక్తం చేయడం కొసమెరుపు!



## బీజేపీ సంబరాలు

బీజేపీ అగ్రనేత, సీనియర్ నాయకుడు, రామజన్మభూమి పోరాటయోధుడు ఎల్కె అద్వానీకి ఇటీవల కేంద్రప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించడంతో నెల్లూరులోని బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన ఈ వేడుకలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, నాయకులు మిడతల రమేష్, ముక్కు రాధాకృష్ణ, కరణం సుభాషిణి, జి. విజయశ్రీ, భాస్కర్‌గౌడ్, సిహెచ్ ప్రవీణ్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, నగరంలోని శివాజీ సెంటర్‌లో బీజేపీ నాయకుడు పి.సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీకి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

## జడ్పీలో కారుణ్య నియామకాలు



నెల్లూరు జిల్లా పరిషత్‌లో ఇటీవల పలువురికి ఉద్యోగాలిన్తా కారుణ్య నియామక పత్రాలను అందించారు. జడ్పీ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో ఈనెల 3న జరిగిన ఈ కార్యక్రమంలో, జడ్పీలో పనిచేస్తూ మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబసభ్యులైన టి.ఇందిరకు వరికుంటపాడు, నిరీష్‌కు సంగంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగాలిస్తూ నియామకపత్రాలను అందజేశారు. జడ్పీ సీఇఓ చిరంజీవి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు భీమిరెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఆధ్యాత్మికోపన్యాసం



నెల్లూరులోని ఫతేఖాన్‌పేటలో ఉన్న శ్రీరామ మందిరంలో ఇటీవల ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కోట కృష్ణమూర్తి 'శ్రీమద్రామాణం-అయోధ్యకాండ' అనే అంశంపై అద్భుతంగా ఉపన్యసించి అందరి ప్రశంసలందుకున్నారు.

## కనీస వేతనాలు లేక..విఆర్‌ఏల అవస్తలు

విఆర్‌ఏలకు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వడంలేదని విఆర్‌ఏల సంఘం నాయకుడు కె.పెంచలనరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరులోని సిఐటియు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి విఆర్‌ఏలు పడుతున్న బాధలను వివరించారు. వేతనాలు పెంచాలని విఆర్‌ఏలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

## డాక్టర్ సీవీకి మిత్రుల అభినందన



కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేయడం కోసం నూతనంగా ఏర్పాటుచేసిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సభ్యుడిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యంను ఇటీవల ఆయన మిత్రులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి మురళి, ఎ.విద్యాసాగర్, బి.బాలు, ఎం.రాజారావు, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం అభినందించి సత్కరించారు.

# హెల్మెట్లు ఉంటేనే భద్రత

### వాహనదారులకు డీటీసీ చందర్ సూచన



ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకోవాలని, వాటిని ధరిస్తే భద్రత ఉంటుందని రవాణాశాఖ ఉప కమిషనర్ (డీటీసీ) చందర్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల ఆయన నెల్లూరులోని భక్తవత్సలనగర్ నుంచి తమ కార్యాలయం వరకు జరిగిన భారీ ర్యాలీకి జెండా ఊపారు. హెల్మెట్లు ధరించిన సుమారు వందమంది ద్విచక్ర వాహనదారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రత గురించి డీటీసీ చందర్ అవగాహన కలిగించారు. అనంతరం, తమ కార్యాలయంలో ఆమేరకు పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఎంవీఐలు కొర్రపాటి మురళీమోహన్, బాలమురళీకృష్ణ, రాంబాబు, కార్తీక్‌పవన్ కుమార్, ఏఎంవిఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌వరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో 23న..జాతీయ సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిబ్రవరి 23న ఇన్స్పిరాన్-2024 జాతీయ సదస్సు నిర్వహిస్తామని కళాశాల డైరెక్టర్ డా. వి.విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఈనెల 5న కళాశాలలో ఇఇఇ విభాగాధిపతి డా.ఎస్.సురేష్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఉత్తమమైన ఆవిష్కరణలకు షీల్డ్‌లు, జ్ఞాపికలు బహుమతులుగా ఇస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ డా.ఐ ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు డా.పి.రమేష్, పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

## పాల సేకరణ కేంద్రాలకు.. లైసెన్సు ఉండాలి

జిల్లాలో పాలు సేకరించే కేంద్రాలకు ఇకనుంచి పశుసంవర్ధకశాఖ నుంచి లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని, లైసెన్సు లేకుంటే చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో అధికారులకు 'మిల్క్ యాక్ట్' పట్ల అవగాహన కలిగించారు. పాలసేకరణ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలని, ఎక్కడా కల్తీ లేకుండా నాణ్యమైన పాలను విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ శాఖ డెప్యూటి డైరెక్టర్లు వి.కోటేశ్వరరావు, నాగమణి, రమేష్‌నాయక్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త తహశీల్దార్లు వచ్చేశారు

ఎన్నికల నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీపై వచ్చిన తహశీల్దార్లకు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఇటీవల పోస్టింగులు ఇచ్చారు. వారు విధులు నిర్వహించాల్సిన మండలాలను కేటాయించారు. నెల్లూరు రూరల్‌కు జీవీ సుబ్బారెడ్డి, నెల్లూరు నగరానికి బి.వెంకటేశ్వర్లు, కోవూరుకు జి.విజయశ్రీ, బుచ్చిరెడ్డిపాళెంకు పి.సురేష్‌బాబు, ఇందుకూరుపేటకు పి.సునీత, తోటపల్లి గూడూరుకు కె.మాధవరెడ్డి, ముత్తుకూరుకు ఎల్.బాలకృష్ణ, వెంకటాచలానికి ఎం.పూర్ణచంద్రరావు, మనుబోలుకు కె.చిరంజీవి, పొదలకూరుకు వీరవసంతరావు, రాపూరుకు బి.వెంకటస్వామి, సైదాపురానికి టి.ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరుకు ఎస్.శివనాగిరెడ్డి, చేజర్లకు కె.గోపీకృష్ణ, ఏఎస్‌పేటకు కె.రవికుమార్, మర్రిపాడుకు సి.సీతారత్నం, సంగంకు బి.రమాదేవి, అనంతసాగరానికి పి.నరసింహారావు, ఉదయగిరికి కె.నెహ్రూబాబు, సీతారామపురానికి పి.వి కృష్ణారెడ్డి, కలువాయికి సిహెచ్ శ్రీనివాసులు, కావలికి కె.నాగేష్, బోగోలుకు ఎం.క్షమారాణి, అల్లూరుకు ఎన్.దుర్గేశ్వరరావు, దగదర్తికి పి.జాన్‌పీటర్, జలదంకికి ఎన్.వాసు, కలిగిరికి బాలకిషోర్, దుత్తలూరుకు ఎస్.వెంకటరత్నం, కొడవలూరుకు పి.శైలేంద్రకుమార్, విడవలూరుకు షేక్ ఇస్మాయిల్, వింజమూరుకు ఎంవి కృష్ణారెడ్డి, కందుకూరుకు పి.కృష్ణ కాంత్, గుడ్లూరుకు ఏ.వి రమణ, లింగసముద్రానికి జి.శ్రీచరణ్, ఉలవపాడుకి కె.రవిబాబు, వలేటివారిపాళెంకు ఎన్. నాగమల్లేశ్వరరావు, కొండాపురానికి డి.శ్రావణ్‌కుమార్, వరికుంటపాడుకు ఏవీపీ చంద్రారెడ్డిలను నియమించారు. అదేవిధంగా నెల్లూరుకు డిఏఓకు కె.సంజీవరావును, భూసేకరణ ప్రత్యేక తహశీల్దారుగా బి.సుశీల, కలెక్టరేట్ ల్యాండ్‌రికార్డ్స్ స్పెషల్ తహశీల్దారుగా ఎం.రాజ్యలక్ష్మిను, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఏ.ఓ దూబగుంట మధుసూదన్‌శర్మను కలెక్టరేట్ పరిపాలనాధికారిగా నియమించారు.

## టూకీగా...

### పెంచలకోనలో వైభవంగా నృసింహుని కల్యాణం

రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువైవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఇటీవల స్వామి వారి కల్యాణోత్సం వైభవంగా జరిగింది. అర్చకులు తొలుత మూలమూర్తికి అభిషేకం, ఆలయంలో గోపూజ చేశారు. అనంతరం స్వామి-అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

### సోమశిల కాలనీలో వెలగని వీధి దీపాలు

అనంతసాగరం మండలంలోని సోమశిల ప్రాజెక్టు కాలనీలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఈ సమస్యను విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా ఈ విషయం పరిశీలించి సంబంధిత సిబ్బందిని పురమాయించాలని వారు కోరుతున్నారు.

### బోగోలులో యోగి వేమన జయంతి

మండల కేంద్రమైన బోగోలులో ఈనెల 4 వేమన జయంతి కార్యక్రమం జరిగింది. నెల్లూరులోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి-హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ వేదిక కమిటీ అధ్యక్షులు డి.సురమౌళి ఆధ్వర్యంలో బాలలకు యోగి వేమన పద్యాల గొప్పతనాన్ని వివరించారు. చిన్నారులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

### నారాయణపురంలో క్యాన్సర్‌పై అవగాహన

ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా బుచ్చి మండలం నారాయణపురంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. క్యాన్సర్‌కు దూరంగా ఉండాలంటే ధూమపానం, పొగాకు ఉత్పత్తులు వాడడం, గుట్కాలు, ఖైనీలు తినడం మానేయాలని సూచించారు.

### అల్లూరులో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

మండల కేంద్రమైన అల్లూరులో ఇటీవల జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మీప్రసన్న ఈ సందర్భంగా సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. పంచాయతి సెక్రటరీ వరప్రసాద్, పెనుగొండయ్య, హరి, విఆర్‌ఓ సలాం, రహంతుల్లా పాల్గొన్నారు.

### రామన్నపాళెంలో పంట నమోదు

కొడవలూరు మండలంలోని రామన్నపాళెం గ్రామంలో ఇటీవల గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి.సత్యవాణి పరిశీలించారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుని ఇకెవైసి చేయించుకునేలా అవగాహన కల్పించాలని ఆమె ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

### కలువాయిలో మాతమ్మతల్లికి పొంగళ్ళు

కలువాయి దళితవాడలో గ్రామదేవతలైన మాతమ్మ-పోతురాజుల దేవస్థానంలో ఈనెల 4న భక్తులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి, అమ్మవారికి పాలపొంగళ్లు తెచ్చి నైవేద్యంగా సమర్పించారు. నిర్వాహకులు కె.కృష్ణ, డి.పెంచల నరసయ్య, కె.నవీన్, ఏ.రవికుమార్, కల్యాణ్‌రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఉలవపాడులో మధ్యాహ్న భోజనం పరిశీలన

మండల కేంద్రమైన ఉలవపాడులోని ఉర్దూ పాఠశాలను ఎంపీటీసి సయ్యద్ ఫజుల్, సర్పంచ్ మానికల నాగలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం ఎలా ఉంటోందో ఆరా తీశారు. మండల వైకాపా నాయకుడు చేవూరి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### నాగులవరంలో ఎన్‌ఎస్‌ఎస్ శ్రమదానం

బోగోలు మండలం నాగులవరం గ్రామంలో ఇటీవల బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేసి సచివాలయం ప్రాంతంలో ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది.

# అడ్వాణీకి అగ్రస్థానం

## 'రామరథ సారథి'కి 'భారతరత్న' బహుమానం

***తన జీవితాన్ని దేశానికి..అయోధ్యరామునికి అంకితం గావించి, దేశ రాజకీయాల్లో తనదైన ప్రత్యేకముద్రతో రాణించి అందరి అభిమానానికి పాత్రులైన 96 ఏళ్ళ రాజకీయ కురువృద్ధుడు, బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వాణీకి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'భారతరత్న' పురస్కారం లభించింది. అయోధ్యలో రామాలయం నిర్మించాలంటూ ఎన్నో కష్టనష్టాలకోర్చి అద్వానీ రామరథ యాత్ర నిర్వహించడం ఆయన జీవితంలో ఒక పెద్ద అధ్యాయం. దాదాపు 5 శతాబ్దాల కల సాకారంగా మారిన వేళ..ఇటీవల అయోధ్యలో ప్రధాని మోడీ చేతులమీదుగా రామాలయం ప్రారంభమైన కొద్దిరోజులకే, రామరథ సారథి అద్వాణీని 'భారతరత్న' వరించింది. ప్రధాని మోడీ స్వయంగా అద్వానీజీకి 'భారతరత్న' లభించిందనే విషయాన్ని ప్రకటించారు. ఏదేమైనా ఈ పురస్కారంతో అద్వాణీ దేశభక్తికి-దైవభక్తికి, దేశానికి ఆయన చేసిన సేవలకు సార్థకత చేకూరినట్లయింది. అంతేకాదు, ఆయన జీవితానికి మరింత పరిపూర్ణత లభించినట్లయింది కూడా.***

అద్వాణీ.. అంటే దేశ రాజకీయాల్లో నీతి నిజాయితీలకు, నైతిక విలువలకు మారుపేరు. అంతేకాదు, 'హిందూత్వ'కు ఆయన మరో పేరు. అట్టడుగు స్థాయి నుంచి పట్టుదలతో ఉన్నతమైన స్థానానికి ఎదిగిన రాజకీయ కృషీవలుడాయన. నమ్మిన సిద్ధాంతం కోసం, నిర్దేశించుకున్న ఆశయాల కోసం ఆయన కట్టుబడి పనిచేశారు. ఆయన జీవిత విజయప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళున్నా.. 'భారతరత్న' లభించడం వాటన్నిటి కంటే అత్యున్నతమైన విజయం అనవచ్చు.

### చిన్నతనం నుంచి ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం :

అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుత పాకిస్తాన్)లో అద్వాణీ 1927లో జన్మించారు. చిన్నతనం నుంచి ఆయనకు ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం. దేశవిభజన తర్వాత ముంబాయిలో స్థిరపడ్డారు. రాజస్థాన్‌లో తొలుత ఆర్ఎస్ఎస్ సంఘ్ ప్రచారక్‌గా, 1957లో ఢిల్లీలో జనసంఘ్ ప్రధాన కార్యదర్శిగా చిత్తశుద్ధితో పనిచేశారు. 1970లో ఢిల్లీనుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై, 1976లో గుజరాత్ నుంచి రెండోసారి, 1982లో మధ్యప్రదేశ్ నుంచి మూడోసారి, 1999లో గాంధీనగర్ నుంచి నాలుగోసారి ఎంపీగా ఎన్నికై దేశరాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. 1977 నుంచి జనతాపార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, 1977లో జనతాపార్టీ ప్రభుత్వంలో కేంద్ర సమాచార



ప్రసారశాఖ మంత్రిగా ఉన్నత పదవిని కూడా అందుకున్నారు. కేంద్ర హోంమంత్రిగా కూడా పని చేశారు. 1999లో ప్రధాని వాజ్‌పేయిగా ఉన్నప్పుడు, ఉపప్రధానిగా అద్వాణీ దేశానికి తనవంతు సేవలందించారు. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించినప్పుడు జైలుజీవితం కూడా అనుభవించారు.

### రామరథ యాత్రతో ప్రఖ్యాతి :

చిన్నతనం నుంచి అద్వాణీకి దేశమంటే అంతులేని గౌరవం. భరతమాత సేవకే జీవితాన్ని అంకితం చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణానికి పట్టుబట్టి ఉద్యమం నిర్వహించిన ఘనత కూడా అద్వాణీదే. 1990లో ఆయన దేశవ్యాప్తంగా రథయాత్ర చేపట్టి, అటు ఆలయానికి-ఇటు బీజేపీకి మరింత ప్రఖ్యాతి తెచ్చారు. అప్పట్లో దేశమంతా అద్వాణీ పేరు మారుమ్రోగిపోయింది. గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి ఆయన రామరథయాత్ర ప్రారంభించారు. ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన రావడంతో యాత్ర దేశవ్యాప్త ఖ్యాతిని తెచ్చుకుంది. జాతీయస్థాయిలో ఆ రథయాత్ర ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభలో కేవలం రెండు సీట్లకే పరిమితమై ఉన్న బీజేపీ దేశంలో తిరుగులేని జైత్రయాత్ర సాగించడానికి మార్గం వేసింది కూడా అద్వాణీ రథయాత్రేనని చెప్పవచ్చు. 1983 నాటికి రెండు స్థానాలు మాత్రమే ఉన్న బీజేపీ 1991 ఎన్నికల్లో లోక్‌సభలో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించడం వెనుక రామతారక మంత్రంతో పాటు అద్వానీ విశేష కృషి కూడా మరువలేనిది. జాతీయస్థాయిలో బీజేపీకి ఏళ్ల తరబడిగా అధ్యక్షునిగా ఉంటూ బీజేపీ రథాన్ని విజయపథం వైపు నడిపిన అభినవ భీష్ములాయన. 1996లో బీజేపీ మొట్టమొదటిసారిగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థాయికి ఎదగడానికి అద్వాణీ కృషి అపారం.. అపూర్వమనే చెప్పాలి. బీజేపీ అగ్రనేత వాజ్‌పేయి-అద్వాణీ ఇద్దరూ కలసి బీజేపీని దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు చేసిన యత్నాలు సాకారమై, వాజ్‌పేయి ప్రధాని కావడం, తదనంతర కాలంలో బీజేపీ పూర్తిస్థాయి మెజారిటీతో తిరుగులేని అధికారంలోకి వచ్చి మోడీ ప్రధాని కావడం తెలిసిందే. అయితే, మోడీ ప్రధాని అయ్యాక ఆయన్ను దూరం పెట్టారనే విమర్శలు కూడా వచ్చాయి. రామాలయం ప్రారంభోత్సవానికి అద్వాణీ రాలేకపోవడం కూడా అందుకు ఒక కారణమని కూడా ఆరోపణలున్నాయి. వృద్ధాప్యం వల్ల ఆయన రాలేకపోతున్నారని చెప్పినా చాలామందికి నమ్మకం కలగలేదు. ఈ నేపథ్యంలో అద్వాణీకి అత్యున్నత పురస్కారంగా 'భారతరత్న' బహుమానాన్ని ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో, అప్పటిదాకా జనంలో ఉన్న అపోహలన్నీ దూదిపింజల్లా ఎగిరిపోయాయి. నాటి ప్రధాని వాజ్‌పేయికి భారతరత్న వచ్చిన తొమ్మిదేళ్ళకు అద్వాణీకి కూడా ఆ ఘనమైన పురస్కారం లభించడం మరో విశేషం.



### ఈ జీవితం నాది కాదు.. దేశానిదే - అద్వాణీ

భారతరత్న పురస్కారం నాకు అత్యున్నత గౌరవం మాత్రమే కాదు.. నేను జీవితాంతం ఆచరించిన విలువలకు, శక్తివంచన లేకుండా అందించిన సేవలకు గుర్తింపు కూడా. ఈ పురస్కారాన్ని అత్యంత వినమ్రతతో, కృతజ్ఞతతో స్వీకరిస్తున్నా'..అంటూ అద్వాణీ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాదు, పద్నాలుగేళ్ల వయసులో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా చేరినప్పటినుంచి భరతమాత సేవకు అంకితమయ్యాయని, 'నా స్వలాభం కోసం నేనేనాడూ ప్రయత్నించలేదు. ఈ జీవితం నాది కాదు.. దేశానిదే' అనే భావనే తనను ముందుకు నడిపించిందని ఆయన చెప్పారు. తనకు భారతరత్న ప్రకటించినందుకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, ప్రధాని మోడీకి అద్వాణీ తన కృతజ్ఞతలు తెలిపారు.

### గురువుకి అభివందనాలు



బీజేపీ అగ్రనేత అద్వాణీకి కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించిన సందర్భంగా తన గురువైన అద్వాణీని కలిసి శుభాకాంక్షలు చెప్తున్న భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

# నిధులు కేంద్రానివి.. గొప్పలు రాష్ట్రానివి

## బీజేపీ నాయకుల విమర్శ



అనేక అభివృద్ధిపనులకు ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం నిధులిస్తోందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అదంతా తమ గొప్పగా చెప్పుకుంటోందని బీజేపీ నాయకులు ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈనెల 7న నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ వద్ద ఉన్న శివాజీసెంటర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం పెద్దఎత్తున పార్టీ ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి, జిల్లాకు కూడా కేంద్రం కోట్లాదిరూపాయల నిధులిస్తోందని, నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి వెంకటేశ్వరపురం నుంచి అయ్యప్పగుడి వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి, పెన్నా నదిపై మూడవ బ్రిడ్జి నిర్మాణం, రామలింగాపురం ఫ్లై ఓవర్లకు కేంద్రం నిధులిచ్చినా, ఆ ఘనతంతా తమదే అన్నట్లుగా వైకాపా నాయకులు చెప్పుకోవడం ఏమిటని వారు విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పి సురేంద్రరెడ్డి, కర్ణాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మిడతల రమేష్, జిల్లా బీజేపీ అధ్యక్షులు శీపా వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే రానున్న ఎన్నికల్లో వైకాపాని గద్దె దింపాలని, బీజేపీకి ఘనవిజయం చేకూర్చాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ మేరకు ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com